ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760
ధర్మవరం, పుట్టపర్తి : 9963160529
కదిరి :9052518170
ఏసీఎం: 9985411154

ప్రతి అర్జీని పరిష్కరించాలి: కలెక్టర్



అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, జూన్2(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీనీ అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 226 ఫిర్యాదులను అందజేశారు. వాటిని స్వీకరించిన కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సంతృప్తికరంగా నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో లక్షల మొక్కలు నాటాలన్నారు. అనంతరం క్షయ నిర్మూలనకోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పశుసంవర్ధక జేడీ శుభదాస్, సెరికల్చర్ జేడీ పద్మావతి, ఎల్‌డీఎం రమణకుమార్, జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం, డీఎఫ్ఓ చక్రపాణి పాల్గొన్నారు.

సత్వరం పరిష్కరించండి: ఎస్పీ



ఫిర్యాదిదారుతో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను చట్ట పరిధిలో సత్వరం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ రత్న సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమా న్ని నిర్వహించారు. మొత్తం 55 అర్జీలను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. కుటుంబకలహాలు, భూసమస్యలు, ఆర్థిక మోసాలు, ఆస్తి పంపకాలకు సంబంధించిన వివాదాలు, సైబర్‌నేరాలు వంటివాటిపై ఎక్కువగా ఫిర్యాదులందాయి. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్పీ సీఏ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తీరనున్న బెంగ..!

- అనంతపురం-బెంగళూరు మధ్య రైలు
- రేపు ప్రారంభించనున్న ఎంపీ అంబికా

7

ఉందిలే మంచికాలం..!

చిలమత్తూరు మండలాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగానే త్వరలో చిలమత్తూరు ప్రాంతంలో డిఫెన్స్ ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీ, ఆటోమొబైల్ సిటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కరువు ప్రాంతాలుగా గుర్తింపు పొందిన లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో పరిశ్రమల అభివృద్ధికి అనువైన టేకులోడు ప్రాంతాన్ని ఎంచుకున్నారు. త్వరలో ఈ ప్రాంతం ఉమ్మడి జిల్లాల్లోనే అతి పెద్ద పారిశ్రామిక వాడగా మారనుంది.

- పారిశ్రామిక వాడగా టేకులోడు
- 880 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్
- పుష్కలంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు..!
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు



టేకులోడు వద్ద పరిశ్రమల కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములు

చిలమత్తూరు ప్రాంతానికి రానున్న పరిశ్రమలు

చిలమత్తూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకులోడు ప్రాంతంలో డిఫెన్స్ ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీ, ఆటోమొబైల్ సిటీలను ఏర్పాటు చేయడానికి భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. అందులో భాగంగా టేకులోడు రెవెన్యూ పొలంలోని 880 ఎకరాల భూమిని సేకరించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దానికి సంబంధించి ఇప్పటికే రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంభించారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రెండు విడుతలుగా 270 ఎకరాలను సేకరించి, రైతులకు పరిహారాన్ని అందించి పరిశ్రమల ఏర్పాటు కోసం భూమిని రిజర్వు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో టేకులోడు రెవెన్యూ పొలంలో 1050 ఎకరాలను పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధం చేస్తోంది. పరిశ్రమల విస్తరణను బట్టి ఇతర గ్రామాల్లో కూడా త్వరలో భూసేకరణ జరుపుతామని అధికారులు పేర్కొంటున్నారు.

పరిశ్రమలకు స్వర్గధామం

చిలమత్తూరు మండలం పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనువైన ప్రాంతం. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని వసతులు పూర్తి స్థాయిలో ఉన్నా గత వైసీపీ ప్రభుత్వం ఉపయోగించుకోలేకపోయింది. ఈ ప్రాంతం రాష్ట్ర సరిహద్దుగా ఉండటం, మండలం మీదుగానే 44వ జాతీయ రహదారి వెళ్తుండటం, సమీపంలో బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటం పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలిస్తున్నాయి. పరిశ్రమలకు అత్యంత అవసరమైనవి రవాణా మార్గాలు. ఆ రవాణా మార్గాలు ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధిలో ఎంతగానో తోడ్పడుతున్నాయి. 44వ జాతీయ రహదారిలోని కొడికొండ చెక్ పోస్టు నుంచి శిర వరకు 544-ఈ జాతీయ రహదారి ఏర్పాటు కావడం పరిశ్రమల ఏర్పాటుకు సానుకూలాంశం. అలాగే పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వ్యవసాయ యోగ్యం కాని భూములు ఈ ప్రాంతంలో ఉండటం మరో సానుకూలాంశం.

అన్నీ టేకులోడులోనే..

కూటమి ప్రభుత్వం చిలమత్తూరు ప్రాంత రూపురేఖలు మార్చబోతోంది. దేశ భద్రతకు అవసరమైన డిఫెన్స్ విమానాలను తయారుచేసే పరిశ్రమలను ఈ ప్రాంతంలో ఏర్పాటు కానున్నాయి. అలాగే సిటిజన్ ఎయిర్ బస్‌ల నిర్మాణ పరిశ్రమలు కూడా రాబోతున్నాయి. వాటికి అనుసంధానంగా ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్ పరిశ్రమలు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. దీంతో త్వరలో ఈ ప్రాంతం పెద్ద పారిశ్రామికవాడగా మారనుంది. పక్కనున్న కియ పరిశ్రమలకు దీటుగా ఈ ప్రాంతం మరో అతిపెద్ద పారిశ్రామిక వాడలా రూపుదిద్దుకోనుంది.

చంద్రబాబుకు రుణపడి ఉంటాం



చంద్రబాబుకు రుణపడి ఉంటాం వెనుకబడిన ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఎంతో రుణపడి ఉంటాం. ఈ ప్రాంతంలో పంటలు కూడా సరిగా పండవు. చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు దొరకడం లేదు. దాంతో జీవనం కష్టంగా మారుతోంది. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం టేకులోడు ప్రాంతాన్ని పారిశ్రామిక వాడగా ఏర్పాటు చేయనుండటం సంతోషం కలిగిస్తోంది. పారిశ్రామిక వాడ ఏర్పడితే చిలమత్తూరు మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలన్నీ ఎంతో అభివృద్ధి చెందుతాయి.

- సరోజమ్మ, టేకులోడు సర్పంచ్, చిలమత్తూరు మండలం

వలసలు ఉండవు



చదువుకున్న పిల్లలు ఉద్యోగాల కోసం బెంగళూరు, ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. అక్కడ కూడా ఉద్యోగాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. టేకులోడు ప్రాంతంలో పరిశ్రమలు రావడం వలన ఇక్కడ చదువుకున్న పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే రోడ్ల పరంగా ఎంతో అభివృద్ధి సాధించింది. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటైతే ఈ ప్రాంత ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది ఉపాధి పొందే అవకాశం ఉంటుంది.

-శ్రీనివాసరెడ్డి, గొళ్లపల్లి, చిలమత్తూరు మండలం



ఊరికి ఉపకరించేలా...

- ఉపాధి పనుల్లో కొత్త పుంతలు
- వ్యక్తిగత, సామాజిక పనులకు ప్రాధాన్యం
- గ్రామాల్లో కొత్తగా 94 పనుల గుర్తింపు



ఉపాధి కూలీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు, గ్రామాలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవకతవకలకు అవకాశం ఉండే పనులను పక్కన పెట్టి రైతులకు లబ్ధి చేకూర్చే, గ్రామాభివృద్ధికి దోహదం చేసే పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇందుకోసం 94పనులు గుర్తించారు. సర్పంచ్, సీనియర్ కూలీలతో వేసిన గ్రామ కమిటీలు, గ్రామ సభల ద్వారా పనులకు అంచనాలు రూపొందించనున్నారు.

నకిలీ మస్టర్లకు చెక్

ఉపాధి పనుల ద్వారా చెరువుల్లో పూడికతీత, కందకాల తవ్వకాలు చేపడుతూనే వ్యవసాయం, రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ రైతులకు వ్యక్తిగతంగా మేలు చేకూరే పనులు గుర్తించనున్నారు. పండ్లు, పూల తోటల పెంపకం, (మిగతా 6వ పేజీలో..)

సార్..! దారుణం

సిల్టు తీయమంటే రోడ్లు, కాలువలు, పునాదులు తవ్వేస్తున్నారు

పరిటాల శ్రీరామ్‌కు ధర్మవరం వ్యాపారులు, ప్రజల మొర



దుకాణాల ముందు తవ్విన దృశ్యాలను పరిశీలిస్తున్న పరిటాలశ్రీరామ్, టీడీపీ నాయకులు

ధర్మవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మురుగు కాలువల్లో పేరుకుపోయిన సిల్టు తీయమంటే దారుణంగా రోడ్డు, కాలువలు, వ్యాపార సముదాయాల పునాదులు కూడా తవ్వేస్తున్నారని పలువురు వ్యాపారులు, ప్రజలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన దుకాణాల ముందు ఇష్టాను సారం తవ్విన పనులను టీడీపీ నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. వ్యాపారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మురుగు కాలువల్లో సిల్టు తీయడం కోసం ప్రభుత్వం పట్టణానికి రూ.30లక్షలు మంజూరు చేసిందన్నారు. అయితే పనులను యంత్రాలతో కాకుండా మనుషులతోనే చేయాలని టెండర్ అగ్రిమెంట్‌లో ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయడం వల్ల దాదాపు రూ.2కోట్ల వరకు వ్యాపారులు నష్టపోయారన్నారు. ఎక్కడికక్కడ పూడిక తీసి రోడ్లపై వేయడం వల్ల వాహనదారులు కూడా ఇబ్బందులు పడ్డారన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తవ్వకాలు చేపట్టడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్లు, వ్యాపారులతో చర్చించి ఎవరికి ఇబ్బంది, నష్టం లేకుండా పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు ఫణికుమార్, సంధా రాఘవ, నాగూర్‌హుస్సేన్, భీమనేని ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జవాన్ కుటుంబం భూమి కబ్జా

- కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయని వైనం
- జవాన్ సెల్ఫీ వీడియోతో కదిలిన యంత్రాంగం

7

వివాహేతర బంధంతోనే హత్య

- భర్తను హత్యచేయించిన భార్య
- ముగ్గురు నిందితుల అరెస్టు

7

నేటి నుంచి పడమర, దక్షిణ గోపురాల ద్వారా ప్రవేశం



కదిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి మంగళవారం నుంచి భక్తులకు పడమర, దక్షిణ గోపురా నుంచి ప్రవేశం కల్పిస్తామని ఆలయ ఇఓ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. తూర్పు రాజగోపురం మరమ్మతుల కారణంగా అక్కడ ప్రవేశాలను నిలిపివేశామని తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పుట్టపర్తిలో మోసగాళ్లు

- కొన్నేళ్ల తర్వాత సొంతం చేసుకుంటున్న వైనం
- స్వచ్ఛంద, విద్యాసంస్థల ముసుగులో మాయ
- పుట్టపర్తి ప్రతిష్ట దెబ్బతీస్తున్న కేటుగాళ్లు
- కేసు పెడితే పోలీసుల పంట పండినట్లే..

పుట్టపర్తిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో కొందరు మాయగాళ్లు విదేశీయులను, ఎన్ఆర్ఐలను మోసం చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. సత్య సాయి భక్తుల ముసుగులో విదేశీయులను నమ్మించి, బుట్టలో వేసుకుని తమపేర్లతో భారీగా ఆస్తులు సంపాదించుకుంటున్నారు. ఆపై అడ్డగోలు వ్యవహారాలు నడిపి విదేశీయులను ముంచేస్తున్నారు. అమెరికాకు చెందిన ఓ మహిళను పుట్టపర్తికి చెందిన సత్యనారాయణరాజు అనే వ్యక్తి (మిగతా 6వ పేజీలో....)

విదేశీయులు, ఎన్ఆర్ఐల డబ్బుతో ఆస్తుల కొనుగోలు



ఆక్రమణలు తొలగించేరా..?

- కొత్తచెరువులో యథేచ్ఛగా కబ్జాలు
- 142 అక్రమ నిర్మాణాల గుర్తింపు
- నోటీసులు ఇస్తామంటున్న అధికారులు



బుక్కపట్నం రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్ (ఫైల్)

కొత్తచెరువు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రోడ్లకు ఇరు వైపులా ఉన్న అక్రమ కట్టడాల తొలగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు అక్రమ నిర్మాణాలను గుర్తించి మార్కింగ్ వేశారు. త్వరలో నోటీసులు ఇచ్చి తొలగించేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి సర్వేలు చేస్తున్నారే కానీ ఆచరణ కనిపించలేదు. రాజకీయ పలుకుబడితో అడ్డుకుంటూ వస్తున్నారు. నెహ్రూ కూడలిలోని నాలుగు ప్రధాన రహదారులు అక్రమ కట్టడాలతో కుంచించుకుపోయాయి. దీనికి తోడు రహదారుల మధ్యలో విగ్రహాలను ఏర్పాటు చేశారు. వాహనదారులు ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గత నెల 4న పుట్టపర్తికి చెందిన సాయివర్షిని అనంతపురంలో పరీక్ష రాసేందుకు బస్సులో వెళుతూ.. ఓ విగ్రహానికి తగులుకొని చేతిని కోల్పోయింది. దీంతో ఆ విద్యార్థిని భవిష్యత్తు అంధకారంగా మారింది. సర్వే నంబర్ 490లోని నెహ్రూ సర్కిల్‌కు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలు, సర్వే నంబర్ 496లో పుట్టపర్తి రోడ్డుకు ఇరువైపులా, సర్వే నంబర్ 532లో ధర్మవరం రోడ్డుకు ఇరువైపులా, సర్వే నంబర్ 473 పెనుకొండ రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. నెహ్రూ కూడలి సమీపంలోని ప్రభుత్వ స్థలాల్లో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. వాటిని అద్దెకు ఇచ్చి రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు.

దినదినాభివృద్ధి చెందుతున్న కొత్తచెరువు

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తికి సమీపంలో కొత్తచెరువు ఉండడంతో దినదినాభివృద్ధి చెందుతోంది. నిత్యం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. కియ పరిశ్రమకు నిత్యం 100 బస్సుల్లో ఉద్యోగులు కొత్తచెరువు మీదుగా వెళుతున్నారు. వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉంటోంది. ఉన్నతాధికారులు సైతం పోలీసులను మందలించినా ఎలాంటి మార్పు కనిపించలేదు.

త్వరలో 142 మందికి నోటీసులు

కొత్తచెరువు మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ, ప్రభుత్వ స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన 142 కట్టడాలను అధికారులు ఇప్పటికే గుర్తించారు. ఈ అక్రమ కట్టడాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓ సువర్ణ గత నెల 28న పరిశీలించారు. ఆర్అండ్‌బీ స్థలంలో నిర్మాణాలను చూసి వారు ఆశ్చర్యపోయారు. ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు చేస్తుంటే.. సంబంధిత అధికారులు ఏమి చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ కట్టడాలు కట్టిన వారందరికీ ఒకటి రెండు రోజుల్లో నోటీసులు ఇవ్వనున్నట్లు రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

నోటీసులు ఇచ్చి కూల్చివేస్తాం

కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ఆర్అండ్‌బీ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చి కూల్చివేతలు మొదలుపెడతాం. రెండు రోజుల్లో నోటీసులు అందజేస్తాం. ఆక్రమణదారులు స్వయంగా అక్రమ నిర్మాణాలను తొలగించుకోవాలి. లేకపోతే మేమే పోలీసుల బందోబస్తుతో ఎక్స్‌కవేటర్ల ద్వారా తొలగిస్తాం. - బాలాంజనేయులు, ఇన్‌చార్జ్ తహసీల్దార్





"అగు హనుమా..!
నీ తల్లి సీతమ్మ పిలుస్తోంది..
అక్కడో అభాగ్యుడు
చింతాక్రాంతుడై కూర్చున్నాడు..
అలా పట్టించుకోకుండా వెళతావేం..?"

"అతనున్నది కలియుగం..
కూర్చున్న చోటు ద్వాపరయుగం..
మనదేమో త్రేతాయుగం..
వాళ్ల కలెక్టర్ గుత్తికి వెళ్లాడు..
వచ్చాక చూసుకుంటాడులే రామచంద్రా.."

గోడు

గోడపై రథమున్నది.. కృష్ణార్జునులు లేరు..!
యుద్ధాలను మాకు వదిలేసి
ఎటో వెళ్లిపోయారు.. అధికారుల్లాగా.. ప్..!

బ్రహ్మసముద్రం మండల కేంద్రానికి చెందిన ఈ పెద్దాయన పేరు గన్నప్ప. కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక ఉంటుందని భావించి సోమవారం వచ్చాడు. కానీ గుత్తిలో ఉండటంతో కలెక్టర్ సహా అధికారులు అందరూ అక్కడికి వెళ్లారు. 'ఇల్లు అమ్ముకున్నాను. సమస్య ఉంది. కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చాను..' అని దిగులుగా చెప్పాడు. తెలియక జిల్లా కేంద్రానికి వచ్చే ఇలాంటివారికోసం ఒక అధికారిని ఇక్కడే ఉంచితే బాగుంటుంది. కలెక్టర్ ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

రేషన్ పంపిణీలో 'అనంత'కు

మూడో స్థానం



రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

అనంతపురం టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపు వద్దే సరుకులు తీసుకోవడానికి లబ్ధిదారులు మొగ్గు చూపుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత టీడీపీ పాలనలో అమలు చేసిన ఈ విధానాన్ని ఆదివారం నుంచి మళ్లీ ప్రారంభించారు. జిల్లాలో 1645 రేషన్‌షాపులలో సరుకుల పంపిణీకి యంత్రాంగం చర్యలు తీసుకుంది. అధికారుల లెక్కట ప్రకారం జిల్లాలో 6,66,300 రేషన్ కార్డులు ఉన్నాయి. రెండు రోజుల్లో 2,22,732 మంది కార్డుదారులు రేషన్ సరుకులు తెచ్చుకున్నారు. సరుకుల పంపిణీలో రాష్ట్రంలో అనంత జిల్లా మూడోస్థానంలో నిలిచినట్లు రాష్ట్రశాఖ వెబ్‌సైట్‌లో ఉంచారు.

అందరికీ సరుకులు: జేసీ

డీలర్ల నుంచి కార్డుదారులందరికీ రేషన్ సరుకులు అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు డీలర్‌షాపులు తెరిచి ఉంటాయన్నారు. 15రోజులు పాటు సరకులు పంపిణీ చేస్తారన్నారు. జిల్లావ్యాప్తంగా 58,390మంది కార్డుదారులు 65సంవత్సలుపైబడినవారు, దివ్యాంగులు ఉన్నారన్నారు. వీరందరికి ఇళ్లవద్దకే వెళ్లి డీలర్లు సరకులు ఇవ్వాలని జేసీ ఆదేశించారు.

కదిరిలో భారీ చోరీ

- పది తులాల బంగారం, నాలుగు కిలోల వెండి అపహరణ

కదిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని దత్తానగర్‌లో నివాసం ఉండే తెలుగు అధ్యాపకులు కవిత నివాసంలో భారీ చోరీ జరిగినట్లు సోమవారం ఫిర్యాదు అందిందని సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఆదివారం రాత్రి 11.30వరకు కుటుంబ సభ్యులందరూ కలిసి మాట్లాడుకున్నారు. తరువాత బెడ్ రూమ్‌లో నిద్రపోయారు. దొంగలు వారు నిద్రిస్తున్న బెడ్ రూమ్‌కాకుండా మరో బెడ్‌రూమ్‌కున్న గ్రీల్ కట్ చేసి, లోపలికి వెళ్లారు. బీరువాలను పగలకొట్టి పది తులాల బంగారం, నాలుగు కిలోల వెండివస్తులు, దాదాపు రూ.లక్ష నగదు చోరీ చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. క్లూస్ టీమ్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించినట్లు చెప్పారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకుల పంట

- జిల్లా విద్యార్థులకు ఆలిండియా స్థాయి ర్యాంకులు
- ఆకులేటి చందనకు 81,
- నితిన్ అగ్నిహోత్రికి 183వ ర్యాంకు
- ఓపెన్ కేటగిరీలో పలువురి సత్తా



81వ ర్యాంకు పొందిన ఆకులేటి చందన , 183వ ర్యాంకు సాధించిన భూపతి నితిన్ అగ్నిహోత్రి , ఉపాధ్యాయ దంపతుల కుమారుడు హార్తిక్‌రెడ్డి

అనంతపురం విద్య, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్(జేఈఈ) అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లాకు ర్యాంకుల పంట పండింది. ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరీలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. సోమవారం జేఈఈ అడ్వాన్స్ ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాకు చెందిన ఆకులేటి చందన ఆలిండియా 81వ ర్యాంకు, భూపతి అగ్నిహోత్రి 360 మార్కులకు 264 మార్కులతో 183వ ర్యాంకు సాధించాడు. పలువురు విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో ఐదు వేల లోపు ర్యాంకులు సాధించారు.

నారాయణ విద్యార్థుల సత్తా

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. టాప్ ర్యాంకులు పొందిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ బద్రీనాథ్, డీజీఎం వెంకట్రామిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా బద్రీనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థి భూపతి నితిన్ అగ్నిహోత్రి 183వ ర్యాంకు సాధించి జిల్లాకే గర్వకారణంగా నిలిచాడని కొనియాడారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో విద్యార్థులు విశాల్ 3,946వ ర్యాంకు, భావన 10,899వ ర్యాంకు, మోక్షసాయిరెడ్డి 12,809వ ర్యాంకు, మహమ్మద్‌ఆసిఫ్ 16,099వ ర్యాంకు, సవిత్‌కుమార్‌రావు 16,884వ ర్యాంకు సాధించారని తెలిపారు. లోకేష్‌కుమార్ 114 ర్యాంకు (ఎస్సీ కేటగిరి), ప్రణయ్‌చౌదరి 5,499(ఈడబ్ల్యూఎస్) ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఐటీల్లో ఇంజనీరింగ్ సీట్లు తప్పనిసరిగా వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రవిశంకర్, ఓబన్నగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ కళాశాల కోర్ డీన్ బద్రినాథ్, సిబ్బంది

తేజ విద్యార్థికి 81వ ర్యాంకు

తేజ జూనియర్ కాలేజ్‌లో చదివిన ఆకులేటి చందన 81వ ర్యాంకు సాధించడంతో డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ ఉమాదేవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చందన 10వ తరగతిలో 560 మార్కులు సాధించిందన్నారు. తేజ కాలేజ్‌లో ఉచితంగా కోచింగ్ ఇచ్చామన్నారు. అధ్యాపకులు ఇచ్చిన బోధనాంశాలు, సూచనలు, సలహాలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు అనిల్ కుమార్, సాయి చైతన్య, నేత్రా, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దంపతుల కుమారుడికి 4,363 ర్యాంకు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉపాధ్యాయ దంపతుల కుమారుడు హార్తిక్‌రెడ్డి 4,363 ర్యాంకు పొందాడు. తల్లిదండ్రులు సూర్యప్రకాష్‌రెడ్డి, రామభారతి ఎస్‌జీ టీచర్లు. 1 నుంచి 10 వరకూ అనంతపురం, ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్యలో చదివాడు. కొడుకు పందిరిపల్లి హార్తిక్‌రెడ్డి జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

18.86 టీఎంసీలు..

తుంగభద్ర డ్యాంలో పెరుగుతున్న నీటి నిల్వ

20 వేల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో

తుంగభద్ర జలాశయం



బొమ్మనహాళ్, జూన్2(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ పెరుగుతూ వస్తోంది. సోమవారానికి 18.86 టీఎంసీలకు చేరింది. జలాశయం పరీవాహక ప్రాంతంలో వర్షాలు బాగా కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో భారీగా చేరుతోంది. సోమవారం 20 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో రావడంతో నీటి నిల్వ 18.86 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 1597.84 అడుగులుగా నమోదైంది. గతేడాది ఇదే సమయానికి జలాశయ నీటిమట్టం 1577.47 అడుగులు ఉండగా.. 3.360 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది. ఈ ఏడాది జలాశయా నికి ముందస్తుగా వరద వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్రిటీషర్లను ఎదిరించిన యోధుడు వడ్డే ఓబన్న

పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీషర్లను ఎదిరించిన యోధుడు వడ్డే ఓబన్న అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక పుట్టపర్తి రహదారిలోని సిరికల్చర్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి శ్రీరామ్ సోమవారం ఆవిష్కరించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలతో కలిసి వడ్డే ఓబన్న పోరాటం చేశారన్నారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం ప్రజల హృదయాల్లో వడ్డే ఓబన్న ఉంటారన్నారు. చదువులు లేకుండానే నగరాలను నిర్మించిన ఘనత వడ్డెర్లకే దక్కుతుందని కొనియాడారు. హక్కుల సాధన కోసం వడ్డెర్లు వేసే ప్రతి అడుగులో పరిటాల కుటుంబం అండగా ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు, వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్, వడ్డెర సంఘం ధర్మవరం అధ్యక్షులు డేరంగుల అంజి, నాయకులు పల్లపు రవీంద్ర, మంజుల నరేంద్ర, తోపుదుర్తి వెంకటరాముడు పాల్గొన్నారు.



వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పరిటాల శ్రీరామ్, వడ్డే అంజినప్ప, చిలకం మధు

పుట్టపర్తిలో

మోసగాళ్లు

(5వ పేజీ తరువాయి)

రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో మోసం చేసి రూ.12.5కోట్లు తీసుకుని మోసం చేశాడనే అభియోగంపై ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు ఒకటిరెండు బయటపడుతున్నాయి. కానీ చలామంది మాయగాళ్లు చాపకింద నీరులా తమ పని చక్కపెట్టుకుంటూ పుట్టపర్తి ప్రతిష్ఠను దెబ్బ తీస్తున్నారు.

నమ్మకమే పెట్టుబడి

విదేశీయుల నమ్మకమే పుట్టపర్తిలోని మాయాగాళ్లకు పెట్టుబడిగా మారింది. అనేక సంవత్సరాల నుంచి సత్యసాయిబాబా దర్శనార్థం పుట్టపర్తికి వచ్చిన విదేశీ భక్తులు, ఎన్ఆర్ఐలకు ఈమోసగాళ్లు సహాయకులుగా దగ్గరై చిన్నచిన్న పనులు చేస్తూ వారిని నమ్మిస్తారు. ఆతరువాత విదేశీయుల డబ్బుతోనే అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, పాఠశాలలు ఏర్పాటు చేసి సేవ చేస్తున్నట్లు నటిస్తారు. విదేశీయులు తమ పేరుపై భారత దేశంలో ఆస్తులు కొనే అవకాశం లేకపోవడంతో ఈమోసగాళ్ల పేరుపైన ఆస్తులు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేయిస్తారు. కొన్నేళ్లపాటు ఈతతంగా సాఫీగా సాగుతుంది. తరువాత ఈఆస్తులు తమ సొంత ఆస్తులుగా ప్రకటించుకుని, విదేశీయులను మోసం చేస్తారు. మరికొంతమంది విదేశీయులకు బినామీలుగా ఉంటామంటూ వారితో పెట్టుబడి పెట్టించి పొలాలు, భూములు,స్థళాలు కొనుగోలు చేయిస్తారు. అవి తమ పేరుపై రిజిస్టేషన్ చేయించుకుంటున్న తరువాత అసలు బుద్ధి చూపిస్తారు. తాము సొంతంగా ఈఆస్తులు కొనుగోలు చేసినట్లు అడ్డం తిరిగి విదేశీలును నిలువునా మోసం చేస్తారు. కొంతమంది మోసగాళ్లకు చదువురాకపోయినా, వివిధ భాషల్లో పట్టు ఉండటంతో వారి పనులు సాఫీగా సాగిపోతున్నాయి. విదేశీయులను మోసం చేసి ఆస్తులు కూడపెట్టుకున్నవారిలో పుట్టపర్తికి చెందిన పలువురు రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, లాయర్లు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు కూడా ఉండటం గమనార్హం.

కేసుపెడితే పోలీసులకు పండగే..!

పుట్టపర్తిలో మోసగాళ్ల బారిన పడి సర్వం పోగొట్టుకున్న విదేశీయులు, ఎన్ఆర్ఐలు పోలీసులను ఆశ్రయిస్తే పోలీసులకు పండగ వచ్చినట్లే. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్న మరుక్షణం నుంచే పోలీసులు హడావుడి చేస్తూ మోసగాళ్ల అంతు చూస్తామని బిల్డప్పులిస్తారు. వారిని నమ్మి, బాధితులు తమ బలహీనతలను కూడా వారికి చెప్పుకుంటారు. ఇదే అదనుగా పోలీసులు మీకు న్యాయం చేస్తాం, ఆస్తులు, తిరిగి ఇప్పిస్తామంటూ వారి నుంచి పెద్ద మొత్తంలో సొమ్ము వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తరువాత మోసగాళ్లను పోలీసులు పట్టుకుని తమ దారికి వచ్చేవరకు వేచి చూస్తారు. మోసగాళ్లతో ఒప్పందం కుదిరిన తరువాత వారి నుంచి కూడా పెద్ద మొత్తంలో సొమ్ము వసూలు చేస్తారు. ఆతరువాత ఇది సివిల్ వ్యవహార మని, కోర్టులో తెల్చుకోవాలని బాధితులకు చెప్పి చేతులు దులుపుకుంటారు. అవసరమైతే తూతూ మంత్రంగా కేసులు పెట్టి వదిలేస్తారు. గత కొన్నేళ్లుగా ఈవ్యవహారం పుట్టపర్తిలో సర్వసాధారణంగా జరుగుతోంది.

మచ్చుకు కొన్ని పరిశీలిస్తే..

- అమెరికాలో నివసిస్తున్న చెన్నైకి చెందిన ఓ ఎన్ఆర్ఐ పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో ఐదున్నర ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. ఎన్ఆర్ఐకి సంతానం లేకపోయినా, ఆయన కుమారుడే భూమిని తమకు రిజిస్ట్రేషన్ చేయించినట్లు కొంతమంది నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈమోసంపై ఆ ఎన్ఆర్ఐ పుట్టపర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరువర్గాల నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసి, కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు.
- పుట్టపర్తి విమానాశ్రయం, కమ్మవారిపల్లి గ్రామాల మధ్యలోని వై.జక్షన్ వద్ద 16 ఎకరాలను ఓ ఆయుర్వే వైద్యుడు ట్రస్టు పేరుతో కొనుగోలు చేసినట్లు విదేశీయులను నమ్మించి, తన పేరుపైన రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనిపై 15 సంవత్సరాల క్రితం పుట్టపర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అయినప్పటికి ఈభూమిని పలువురు రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్లాట్లు వేసి విక్రయించారు.
- పుట్టపర్తి గణేష్ సర్కిల్ సమీపంలో ఇటలీ మహిళను మోసగించి, రూ. ఐదుకోట్ల విలువ చేసే ఓ భవనాన్ని పుట్టపర్తికి చెందిన ఓ వ్యక్తి తన పేరుపై రాయించుకున్నాడు.
- కర్నాటక నాగేపల్లి సమీపంలోని ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలను కబ్జా చేయడానికి కొంతమంది రాజకీయ నాయకులు విశ్వ ప్రయత్నం చేశారు. ఈపాఠశాలకు నిధులు సమకూర్చిన విదేశీ మహిళ, తీవ్రంగా ప్రతిఘటించడంతో కబ్జా విషయం తాత్కాలికంగా నిలిచిపోయింది.
- పుట్టపర్తి వివేకానంద రోడ్డులో కోల్‌కతాకు చెందిన ఓ ఎన్ఆర్ఐ మహిళ 20 సంవత్సరాల కిందట ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే ఆమె చనిపోయినట్లు కోల్‌కతా కార్పొరేషన్‌లో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి పుట్టపర్తికి చెందిన ఓవ్యక్తి తనపేరుపై ఆ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కొద్దిరోజుల తరువాత విషయం తెలుసుకున్న ఆ ఎన్ఆర్ఐ పుట్టపర్తికి వచ్చి ఆవ్యక్తిని నిలదీయగా, రిజిస్ట్రేషన్ రద్దు చేసుకుని, పలాయనం చిత్తగించాడు.
- జగరాజుపల్లిలో ఓ ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థలు, విదేశీ నిధులతోనే ఏర్పాటు అయ్యాయి. రూ.కోట్లాది ఆస్తులు ఈస్వచ్ఛంద సంస్థ పేరుపై ఉన్నాయి. వీటిని స్వాహా చేయడానికి కూడా అనేకమంది ప్రయత్నాలు చేస్తున్నారు.

ఊరికి ఉపకరించేలా...

(5వ పేజీ తరువాయి)

పంటనీటి కుంటలు, మినీగోకులాల నిర్మాణం, మామిడి మొక్కల చుట్టూ ట్రెంచ్‌లు తవ్వకం, కంపోస్ట్ పిట్‌లు, ఇంకుడు గుంతల పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రైతులు తమ వ్యవసాయ భూముల్లో వీటిని చేపట్టొచ్చు. రైతులకు వ్యక్తిగతంగా లబ్ధి చేకూర్చే పనులు కాబట్టి నకిలీ మస్టర్లకు సిబ్బంది సాహసించలేరని అధికారులు చెబుతున్నారు.

గ్రామాభివృద్ధికి ఊతమిచ్చేలా పనులు

ఉపాధి పథకం కింద గ్రామాభివృద్ధికి దోహదం చేసే పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. కొండలపై పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడం, దేవాలయాల ప్రాంగణంలోని కోనేర్లు, దశాబ్దాల నాటి చెరువుల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. గిరిజన ప్రాంతాల్లో నీటి సంరక్షణకు స్ప్రింగ్ షెడ్ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఉపాధి హామీ పథకంలో 266రకాల పనులను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయి. రాష్ట్రంలోని రైతుల అవసరాలు, సామాజికాభివృద్ధికి వీలున్న 94పనులతో ఓ జాబితాను రూపొందించారు. దీన్ని అన్ని గ్రామాల్లో ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయనున్నారు.

గ్రామాల అభివృద్ధి కోసం..: సలీంబాషా, డ్వామా పీడీ



ఉపాధి పథకం కింద గ్రామాల అభివృద్ధికి శాశ్వతమైన పనులు చేపట్టాలి. మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఉపాధి పథకం కింద వ్యక్తిగత, సామాజికాభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిదే. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, గ్రామ అవసరాల మేరకు మొత్తం 94 పనులు చేపట్టాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పనులు చేపట్టాలి. ఇందుకు అవసరమైన మేరకు క్షేత్రస్థాయిలో ఉండే ఉపాధి సిబ్బందికి ఆయా పనులు, సడలింపులపై శిక్షణ కూడా ఇచ్చాం. గ్రామాల్లో ఉపాధి పథకంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రజలు ముందుకు రావాలి.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

బలవంతపు భూసేకరణను ప్రతిఘటిస్తాం : ఏపీ రైతు సంఘం

పెనుకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బలవంతపు భూసేకరణను ప్రతిఘటిస్తామని ఏపీ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అధ్యక్షతన హిందూపురం, లేపాక్షి, పరిగి పరిధిలోని చలివెందుల, రాచపల్లి, మలుగూరు, మీనకుంటపల్లి, కొండూరు, వడ్డిపల్లి, తిమ్మగానిపల్లి గ్రామాలకు చెందిన రైతులు బలవంతపు భూసేకరణ ఆపాలంటూ పెనుకొండలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనలో పాల్గొన్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో ముందస్తు సమాచారం లేకుండా, గ్రామసభలు నిర్వహించకుండా 80శాతం మంది రైతుల ఆమోదం లేకుండా బలవంతపు భూసేకరణ చేయడం అన్యాయమన్నారు. పరిగి, హిందూపురం ప్రాంతాల్లో పరిశ్రమల పేరుతో భూములు సేకరించి ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి దశాబ్దాలు గడుస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ పైగ్రామాల్లో 1118మంది రైతుల నుంచి 2191ఎకరాల భూమిని దేనికోసం సేకరిస్తున్నారో చెప్పకుండా, గ్రామసభల్లో వివరించకుండా బలవంతంగా లాక్కోవడం దారుణమన్నారు. బలవంతపు భూసేకరణలు ఆపాలని లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటాలకు సన్నద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సిద్దారెడ్డి, ఫక్రుద్దీన్, వేమారెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బహుగ్రంథ రచయిత రమేష్ నారాయణ

పుస్తకావిష్కరణ సభలో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కల్చరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విభిన్న అంశాలపై ప్రతిభావంతమైన రచనలు చేసిన విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్‌నారాయణ బహుగ్రంథ రచయిత అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. విద్యావేత్త, రచయిత రమేష్‌నారాయణ రచించిన 'మహ్మద్ రసూల్ వారి జీవిత చరిత్ర' పుస్తకాన్ని సోమవారం అశోక్‌నగర్‌లోని రహీమ్ ఖాద్రీ మసీదు ఆవరణలో ఎమ్మెల్యే దగ్గుపాటి, ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫిల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య, సాహిత్యం, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక రంగాలపై రమేష్ నారాయణకు లోతైన అవగాహన ఉందన్నారు. 75 సంవత్సరాల వయసులోనూ నిత్యచైతన్యశీలిగా సామాజిక బాధ్యతను నెరవేరుస్తుండడం స్ఫూర్తిదాయకమన్నారు. సాయిబాబా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుదీర్ఘ సేవలందించారని గుర్తుచేశారు. వైజ్ఞానిక సామాజిక శాస్త్రాలు, సాహిత్య విమర్శ తాత్విక, జానపద గ్రంథాలు, ఆధునిక తెలుగుకావ్యాలు, అనేక ఆంగ్ల అనువాదాలు, పాపులర్ సైన్స్ వ్యాసాలు, ఆకాశవాణి ప్రసంగాలు, అనంత జానపదగేయాల ఆంగ్లవాదం వంటి రచనలు రమేష్‌నారాయణ ప్రతిభకు నిదర్శనాలని కొనియాడాన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు కేఎం షఫీవుల్లా, పలువురు ముతవల్లిలు పాల్గొన్నారు.



'మహ్మద్ రసూల్ వారి జీవిత చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

క్రైం కార్నర్

వివాహేతర బంధంతోనే హత్య

● భర్తను హత్యచేయించిన భార్య ● ముగ్గురు నిందితుల అరెస్టు



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు తగులుతున్న భర్తను హత్య చేయించిన సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్పీ రత్న తెలియచేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్సుహాల్‌లో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో కలిసి హత్యకేసు వివరాలను సోమవారం ఆమె వెల్లడించారు. ధర్మవరం రూరల్ మండలం పోతుకుంట గ్రామానికి చెందిన అల్లే మంజునాథ్‌కు రామగిరి మండలం పోలేపల్లికి చెందిన యమునతో 12 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. బతుకు తెరువుకోసం పెనుకొండకు వెళ్లి మంజునాథ్ డ్రైవరుగా పని చేస్తూ జీవనం సాగించేవారు. ఈక్రమంలో తాగుడుకు అలవాటుపడ్డ మంజునాథ్ భార్య ప్రవర్తనపై అనుమానంతో తరచు గొడవ పడుతుండేవాడు. రొద్దం మండలం ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన సిద్దప్ప అలియాస్ సిద్దుతో మంజునాథ్ భార్య యమున వివాహేతర సంబంధం ఉండేది. ఈనేపథ్యంలో తమ బంధానికి అడ్డుగా ఉన్న భర్త మంజునాథ్‌ను చంపాలని యమున సిద్దప్పపై ఒత్తిడి చేసింది. దీంతో అతడు తన స్నేహితులు పరిగి మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన నూర్ మహమ్మద్, పావగడ తాలూకా హుస్సేనాపురం గ్రామానికి చెందిన మదన్‌మోహన్, రొద్దం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మోహన్‌లతో హత్యకు పథకం రూపొందించాడు. ఆమేరకు గత ఏడాది ఏప్రిల్ 22న ధర్మవరం మండలం నాగలూరు వద్ద గల పెద్దవంకలోకి మద్యం తాగడానికి మంజునాథ్‌కు తీసుకెళ్లారు. అక్కడ అధికంగా మద్యం తాపించారు. ముందస్తు పథకం మేరకు పూర్తి మత్తులో ఉన్న మంజునాథ్ గొంతుకు టవల్ బిగించి హత్య చేశారు. అప్పట్లో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న ధర్మవరం రూరల్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో హత్య చేసిన నిందితులను కనుగొన్నారు. పక్కా సమాచారంతో ఆదివారం సాయంత్రం పోతుకుంట గ్రామ శివాలయం వద్ద సిద్దప్ప, నూర్ మహమ్మద్, మదన్‌మోహన్‌లను అరెస్టు చేశారు. యమున, మోహన్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, రూరల్ ఎస్సై శ్రీనివాసులు, సిబ్బంది చత్రునాయక్, అనిల్‌కుమార్, బాలకృష్ణకు ఎస్పీ నగదు రివార్డులను అందచేసి అభినందించారు. సమావేశంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీయుడి మృతి



డేవిడ్విచ్ డెజినిస్ మృతదేహం

పుట్టపర్తి రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో భవనం పై నుంచి పడి బెలారస్ దేశస్థుడు డేవిడ్విచ్ డెజినిస్(38) మృతిచెందాడు. ఈ ఘటన పుట్టపర్తిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కర్ణాటకకు చెందిన అతని స్నేహితుడు మంజునాథ్, పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపిన వివరాల మేరకు, డేవిడ్విచ్ తన భార్యతో గొడవ పడి భారతదేశానికి వచ్చాడు. పుట్టపర్తిలోని ప్రియాంక గెస్టుహౌస్ ఐదో అంతస్తులో మూడు నెలలుగా ఉంటున్నాడు. భార్యాపిల్లలకు దూరంగా ఉంటూ, మానసిక వేదన అనుభవిస్తున్నాడు. నిరంతరం మద్యం సేవిస్తూ, మతిస్థిమితం లేనివాడిలా ప్రవర్తించేవాడు. ఈక్రమంలో మద్యం అతిగా సేవించి, ఆదివారం రాత్రి 9గంటల సమయంలో భవనం ఐదో అంతస్తు నుంచి కిందపడి మృతిచెందాడు. మంజునాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మామిడిపండ్ల కోసం వెళ్తే.. కొట్టారు..!

● పోలీసులు పట్టించుకోలేదు ● ఎస్పీకి బాధితుల ఫిర్యాదు



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మామిడి పండ్ల కోసం వెళ్తే... తమపై దాడి చేశారనీ, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. బ్రహ్మసముద్రం మండలం కుర్లగుండ గ్రామానికి చెందిన హరిజన హేమలత సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ జగదీష్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. గత నెల14వ తేదీ తాను రాధమ్మ, తులసితో కలిసి మొక్కజొన్న తోటకు పని కోసం వెళ్లామని, ఆ సమయంలో పక్క పొలంలో ఉన్న మామిడి పండ్లు కోయడానికి వెళ్లామని తెలిపింది. ఆ సమయంలో పొలానికి చెందిన రామాంజనేయులు, అతడి కుమారుడు అనిల్, బావమరిది కిష్టప్ప తమపై కర్రలతో దాడి చేశారని ఆరోపించింది. ఈ ఘటనపై బ్రహ్మసముద్రం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, కేసు నమోదు చేశారన్నారు. ఇప్పటివరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపింది. వారు తమను చంపుతామని బెదిరిస్తున్నారనీ, తగిన న్యాయం చేయాలని కోరింది. నగరంలో రామ్మోహన్ అనే వ్యక్తి చిట్టీల పేరుతో డబ్బు ఇవ్వకుండా మోసం చేశాడని లక్ష్మీదేవి అనే మహిళ ఆరోపించింది. ఎస్పీని కలిసి సమస్య వివరించింది. తన లాంటి బాధితులు చాలామంది ఉన్నారని తెలిపింది. ఏడాదిన్నర క్రితం జరిగిన చోరీ కేసు నేటికీ ఛేదించలేదనీ, న్యాయం చేయాలని అనంతపురంలోని నాయక్‌నగర్‌కు చెందిన పార్థసారథి కోరారు. 2023 నవంబరు 12న తన ఇంట్లో 28 తులాల బంగారం పోయిందని, ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు న్యాయం జరగలేదని వివరించారు.

ఫిర్యాదిదారులు సంతృప్తి పడేలా పరిష్కారం చూపండి: ఎస్పీ

ఫిర్యాదిదారులు సంతృప్తి చెందేలా చట్టపరిధిలో పరిష్కారం చూపాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. పోలీసు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 103 వినతులు వచ్చాయి. వారితో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎస్పీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

జవాన్ కుటుంబం భూమి కబ్జా

● కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయని వైనం
● జవాన్ సెల్ఫీ వీడియోతో కదిలిన యంత్రాంగం



పొలం వద్ద వివరాలు సేకరిస్తున్న అధికారులు

మడకశిర/అమరాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): 'సరిహద్దుల్లో దేశ రక్షణ విధులు నిర్వహిస్తున్నాను. కానీ మా సొంతూరులో నా కుటుంబానికే రక్షణ లేకుండాపోయింది. మా మామకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని కబ్జా చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదు. ఎప్పుడో ఏడాదికి ఒక సారి ఊరికి వచ్చి వెళుతుంటాను. అక్కడ మాకు అండగా ఎవరూ లేరు. పొలంలోకి వెళితే వృద్ధులైన మా అత్త, మామపై రాళ్లతో దాడి చేస్తున్నారు. గొడ్డలితో నరికేందుకు వస్తున్నారు. నాలుగేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ స్పందించి మాకు న్యాయం చేయాలి' అని ఓ బీఎస్ఎఫ్ జవాన్ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తన ఆవేదన ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా చూడాలని ప్రజలకు విన్నవించారు. 'నేను జవాన్‌ను. నా పరిస్థితి ఇలా ఉంది అని చెప్పుకునేందుకు సిగ్గుగా ఉంది..' అని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం ఉదుగూరు గ్రామానికి చెందిన నరసింహమూర్తి బీఎస్ఎఫ్‌లో జవానుగా పనిచేస్తున్నారు. జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన, సోమవారం ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తన భార్య తల్లిదండ్రులకు కొడుకులు ఎవరూ లేరని, వృద్ధాప్యంలో ఉన్న వారి బాగోగులను తానే చూసుకుంటున్నానని పేర్కొన్నాడు. వారి భూమిని కె.శివరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు ఆక్రమించుకున్నాడని, సాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తే దాడి చేసేందుకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద ఆ పొలం డి పట్టా, అడంగల్, వన్ బీ, కోర్టు ఆర్డర్ సహా అన్నీ ఉన్నాయని, నాగరాజు వద్ద ఎలాంటి డాక్యుమెంట్ లేకున్నా పొలంలోకి రానివ్వడం లేదని వివరించారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

కదిలిన యంత్రాంగం



సెల్ఫీ వీడియోలో బీఎస్ఎఫ్ జవాన్ నరసింహమూర్తి

బీఎస్ఎఫ్ జవాన్ సెల్ఫీ వీడియోతో అధికార యంత్రాంగం కదిలింది. రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు గ్రామానికి వెళ్లి విచారించారు. భూమి వివరాలను సేకరించారు. కబ్జాకు గురైన భూమిని పరిశీలించారు. తహసీల్దార్ లక్ష్మీనరసింహం, ఎస్ఐ ఇర్షాద్ బాషా, ఏఎస్ఐ రామాంజినేయులు క్షేత్రస్థాయికి వెళ్లారు. సర్వేయర్లు, సిబ్బందితో భూమికి కొలతలు వేశారు. 'జవాన్ నరసింహమూర్తి వాళ్ళ మామ కదిరప్పకు 1988లో ప్రభుత్వం డి.పట్టా ఇచ్చింది. సర్వే నంబర్ 336-6 34 సెంట్లు, 336-7 లో 50 సెంట్లు, 366-8లో 58 సెంట్లు 366-9లో 56 సెంట్ల భూమిని కేటాయించింది. ఈ భూమి కె.శివరం గ్రామ సమీపంలో ఉంది. సాగు చేసేందుకు వెళితే పక్క పొలానికి చెందినవారు అడ్డగిస్తున్నారు. దీంతో కదిరప్ప కోర్టుకు వెళ్లారు. కోర్టు.. జవాన్ మామకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ భూమిని జవాన్ మామ కదిరప్పకు మంగళవారం అప్పగిస్తాం. పోలీసు రక్షణ కల్పించి ఇబ్బంది లేకుండా చూస్తాం' అని తహసీల్దారు అన్నారు.

బోయరెడ్డిపల్లిలో ఉద్రిక్తత

● పాతకక్షల నేపథ్యంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల దాడులు
● ముగ్గురికి గాయాలు



గాయపడిన మారుతి, లక్ష్మీదేవి, దాడిలో ధ్వంసమైన బైక్

యాడికి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో పాతకక్షల నేపథ్యంలో ఇరుపార్టీల వర్గీయులు ఘర్షణ పడ్డారు. దీంతో టీడీపీకి చెందిన లక్ష్మీదేవి, పెద్దరామకృష్ణ, వైసీపీకి చెందిన మారుతి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు సోమవారం ఉదయం బోయరెడ్డిపల్లి గ్రామం వద్ద టీడీపీ వర్గానికి చెందిన కిషోర్ అనే యువకుడు స్థానిక సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి ద్విచక్రవాహనంలో గ్రామంలోకి వస్తుండగా వైసీపీకి చెందిన మారుతి ద్విచక్రవాహనంలో వచ్చి ఢీకొట్టాడు. ఈ సమాచారం అందుకున్న కిషోర్ సమీప బంధువులు సంఘటన ప్రదేశం వద్దకు వచ్చి మారుతిపై దాడిచేసి గాయపరిచారు. మారుతిని చికిత్స నిమిత్తం తాడిపత్రికి అక్కడి నుంచి అనంతపురం తరలించారు. సోమవారం మధ్యాహ్నం సొంత పనులపై యాడికికి వెళ్లి బోయరెడ్డిపల్లికి తిరిగి వస్తున్న టీడీపీ వర్గీయుడు, కిషోర్ బంధువైన రాంమోహన్‌పై తిరుణాంపల్లి గ్రామ సమీపాన పెట్రోల్ బంకు వద్ద వైసీపీకి చెందిన ఓబులేసు, మంజునాథ్, రమేష్ దాడి చేశారు. తనపై జరిగిన దాడిని రాంమోహన్ గ్రామంలోని తమ బంధువులకు తెలిపాడు. దీంతో గ్రామంలో ఇరువర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడిలో లక్ష్మీదేవి, పెద్దరామకృష్ణ గాయపడ్డారు. గాయపడ్డవారిని తాడిపత్రికి తరలించారు. పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాలవారు పరస్పరం దాడులు చేసుకోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని బోయరెడ్డిపల్లి గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సర్కిల్ సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు గ్రామానికి వెళ్లి పరిస్థితిని చక్కదిద్దారు. బందోబస్తు ఏర్పాటుచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్లెక్సీ చించివేయడమే కారణమా..?

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డిల పుట్టినరోజు సందర్భంగా బోయరెడ్డిపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. స్థానిక రామాలయం వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని వైసీపీ వర్గీయుడు మారుతి చింపాడని, అందుకే టీడీపీ వర్గీయులు ఆ యనపై ఆగ్రహంతో ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య గొడవలు ఉన్నాయి. అప్పట్లో ఒకరిపై ఒకరు దాడులు చేసుకు న్న సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యమే సోమవారం జరిగిన దాడులకు కారణమై ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

వివరాలు ఆరాతీసిన ఏఎస్పీ

బోయరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన దాడులపై సోమవారం రాత్రి తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి గ్రామానికి వెళ్లి వివరాలు ఆరాతీశారు. దాడుల నేపథ్యంలో గ్రామస్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బోయరెడ్డిపల్లిలో దాడులపై ఆరాతీస్తున్న సీఐ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● గుత్తి కోట ఉత్సవాలకు రూ.50 లక్షల నిధులు
● కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ

గుత్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మారుతున్న వైవిధ్య జీవన శైలిలో ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులు కావచ్చునని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని చారిత్రాత్మక గుత్తి కోట గుర్రపుశాల వద్ద సోమవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, జిల్లా అధికారులు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, తహసీల్దార్ ఓబులేసుతో పాటు పలువురు అధికారులు స్వాగతం పలికారు. ట్రెక్కింగ్ నిర్వహిస్తూ కోటపై గుర్రపు శాలకు చేరుకున్నారు. అక్కడ విశాలమైన మైదానంలో దాదాపు 1500 మందితో ఆయుష్ శాఖ యోగా గురువులు గురురాజారావు, కృష్ణవేణి యోగాసనాలు చేయించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో మలోల, జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, జిల్లా, స్థానిక అధికారులతో కలిసి పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు యోగా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ట్రెక్కింగ్ చేయడం మధురానుభూతి ఇచ్చిందన్నారు. యోగా చేయడం వల్ల ఆహ్లాదకరంగా, సంతోషకరంగా ఉందన్నారు. గుత్తి కోటలో జనవరిలో జరిగే వారోత్సవాలకు ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. యోగాంధ్రకు హాజరైన వారికి గుత్తి మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. యోగా గురువు కృష్ణయ్య, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌ను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఎంఈఓ రవినాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు చికెన్ శ్రీనివాసులు, కోనంకి కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

తీరనున్న బెంగ..!

● అనంతపురం, బెంగళూరు మధ్య రైలు
● జిల్లా కేంద్రం నుంచి బయల్దేరే తొలి బండి
● రేపు ప్రారంభించనున్న ఎంపీ అంబికా
● అనంతవాసుల ఆనందం



అనంతపురం న్యూటౌన్/గుంతకల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు జిల్లావాసుల కల నెరవేరింది. అనంతపురం మీదుగా ఎన్నో రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఏ ఒక్కటీ అనంతపురం నుంచి మొదలవదు. దీంతో రైలు ప్రయాణికులు ముందుగానే స్టేషన్‌కు చేరుకుని, నిరీక్షించి, బండి రాగానే పరుగెత్తుకుంటూ ఎక్కేవారు. అనంతపురం నుంచే రైలు మొదలైతే బాగుండేదని జిల్లావాసులు కోరుకునేవారు. ఎట్టకేలకు అనంతవాసుల కల నెరవేరింది. అనంతపురం నుంచి ఓ రైలు బండి బయల్దేరనుంది. అనంతపురం, బెంగళూరు మధ్య నడిచే మెయిల్‌లైన్ ఎలెక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్ (మెము) రైలును ఈనెల 4వ తేదీన మధ్యాహ్నం 1.30 గంటకు ప్రారంభించనున్నారు. పుట్టపర్తి, బెంగళూరు మధ్య నడిచే ఈ రైలును అనంతపురం వరకు పొడిగించారు. ఈ రైలును అనంతపురం నుంచి ప్రారంభించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తీవ్ర పోరాటం చేశారు. పలుమార్లు రైల్వే మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పోరాట ఫలితంగా రైలును అనంత నుంచి ప్రారంభించేలా రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో నగరం నుంచి మొదలయ్యే మొట్టమొదటి రైలుగా ఇది నిలువనుంది. అనంతపురం నుంచి బెంగళూరు వెళ్లాలనుకునే రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఉదయం పూట అవి కూడా ఎక్స్‌ప్రెస్ రైళ్లే ఉన్నాయి. వాటిలో జనరల్ బోగీలు తక్కువ. మధ్యాహ్న సమయంలో అవి కూడా లేవు. దీంతో ఇబ్బందులు పడేవారు. మధ్యాహ్న సమయంలో అది కూడా మెము రైలు బయల్దేరనుండడం ఎంతో ప్రయోజనకరమని జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్నం నుంచి..

అనంతపురం, బెంగళూరు మధ్య నడిచే (66560) మెము రైలును అనంత రైల్వేస్టేషన్‌లో ఈనెల 4న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లాంఛనంగా ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటకి జెండా ఊపి ప్రారంభిస్తారు. షెడ్యూల్‌కు అనుగుణంగా 2.10 గంటకు రైలు బయల్దేరుతుంది. ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం మీదుగా రాత్రి 7.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం.66559) బెంగళూరులో ఉదయం 8.35 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.55కి అనంతపురం చేరుకుంటుంది.



మాట్లాడుతున్న ఏపీసీ శైలజ

ఉపాధ్యాయుడే భావితరాల రూపకర్త: ఏపీసీ

అనంతపురం విద్య, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే భావితరాల రూపకర్త ఉపాధ్యాయుడేనని అనంతపురం సమగ్రశిక్ష ఏపీసీ శైలజ పేర్కొన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయులకు టర్ల్ మూడు రోజుల శిక్షణా తరగతులను నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఏపీసీ శైలజ, రాష్ట్ర పరిశీలకుడు సురేష్‌కుమార్ హాజరయ్యారు. ఏపీసీ శైలజ మాట్లాడుతూ.. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు గణితం, భాషలు బోధించే టీచర్లలో బోధనా సామర్థ్యాలు పెంచడానికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని టీచర్లకు సూచించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 252 మంది టీచర్లు, 14 మంది రిసోర్స్ పర్సన్లు శిక్షణకు హాజరైనట్లు అనంతపురం సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఎంఈఓలు, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఏడాది పాటు జాయింట్ కలెక్టర్ పర్సన్ ఇన్‌చార్జిగా సాగిన ఏడీసీసీ బ్యాంకుకు కూటమి ప్రభుత్వం ఇటీవల ఛైర్మన్‌ను నియమించింది. సోమవారం ఉదయం ఏడీసీసీ బ్యాంకులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి శుభముహూర్తంలో ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా సాదాసీదాగా బాధ్యతలు చేపట్టారు. త్వరలో భారీ సభ నిర్వహించి ప్రజలు, టీడీపీ నేతల సమక్షంలో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామలింగారెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేష్, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణితోపాటు పలువురు నాయకులు, మిత్రులు, బ్యాంకు అధికారులు.. కేశవరెడ్డికి అభినందనలు తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా నెట్టెం వెంకటేష్..



బాధ్యతలు స్వీకరిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్

అనంతపురం క్లాక్ టవర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ ఛైర్మన్‌గా నెట్టెం వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం స్థానిక కమలానగర్‌లో ఉన్న డీసీఎంఎస్ కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి శుభముహూర్తంలో వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా సాదాసీదాగా బాధ్యతలు చేపట్టారు. త్వరలో భారీ సభ నిర్వహించి ప్రజలు, టీడీపీ నేతల సమక్షంలో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామలింగారెడ్డి, ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయభాస్కర్‌తోపాటు పలువురు టీడీపీ నాయకులు, మిత్రులు, సిబ్బంది వెంకటేష్‌కు అభినందనలు తెలిపారు.

కొత్త ఏసీ, ఏడీ విధుల్లో చేరిక



ఏసీ వెంకటేశ్వర్లు, ఏడీ పఠాన్ మునీర్‌ఖాన్

అనంతపురం విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖకు బదిలీపై వచ్చిన అధికారులు సోమవారం విధుల్లో చేరారు. కడప జిల్లా నుంచి జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా వెంకటేశ్వర్లు, ఏడీగా పఠాన్ మునీర్ ఖాన్ వచ్చారు. వారిరువురు 1వ రోడ్డులోని శారదా స్కూల్‌లో ఉన్న డీఈఓ ప్రసాద్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత విధుల్లో చేరారు. వారికి విద్యాశాఖ ఉద్యోగులు, సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నేతలు అభినందనలు తెలిపారు.

చీనీ టన్ను రూ.30వేలు

అనంతపురంరూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.30,800 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తం 451 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

విత్తనకాయలకు నమోదు చేసుకోండి: ఏఓ

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ఖరీఫ్ 2025కి సంబంధించి ప్రభుత్వం సబ్సిడీతో అందించే వేరుశనగ విత్తనకాయల కోసం రైతుసేవా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ ముస్తఫా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కే-6, టీసీజీఎస్-1694 రకం విత్తనకాయల 30 కిలోల బస్తాధర రూ.2790 కాగా సబ్సిడీ రూ.1116 పోను రైతు రూ. 1674 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక రైతుకు గరిష్ఠంగా మూడు బస్తాలు ఇస్తామన్నారు. అర్ధఎకరా లోపు ఉంటే బస్తా, ఎకరా లోపు ఉంటే రెండు బస్తాలు, ఒకటిన్నర కన్నా ఎక్కువ భూమి ఉంటే మూడు బస్తాలు ఇస్తామన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు దుర్వినియోగం చేసుకోకుండా విత్తుకోవాలన్నారు. త్వరలోనే కందులు, పెసలు, అలసందలు, ఉలవ, జీలుగ విత్తనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. అలాగే వేరుశనగ విత్తనకాయల కోసం ఆర్‌ఎస్‌కేల్లో రైతులు పేర్ల నమోదు చేసుకోవాలని నల్లచెరువు ఏఓ భారతి, గాండ్లపెంట ఏఓ లక్ష్మీప్రియ, ఓబుళదేవరచెరువు మండల ఏఓ ఇలియాజ్ అహమ్మద్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డీటీ బాలాంజనేయులు

కొత్తచెరువు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ బాలాంజినేయులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ నీలకంఠారెడ్డి మే 31న పదవీ విరమణ చేశారు. దీంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డీటీకి బాధ్యతలు అప్పగించారు.

'అందుబాటులో లేని సచివాలయ సేవలు'

అమడగూరు (కదిరి), జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాబాద్ సచివాలయంలో రైతులకు అందించే సేవలు అందుబాటులో లేవని పలువురు రైతులు పేర్కొన్నారు. వారు సోమవారం సచివాలయం వద్ద మాట్లాడుతూ... బ్యాంకుల్లో రైతుల రుణాల రెన్యువల్ చేస్తున్నారని, అందుకు వన్-బీల కోసం సచివాలయానికి వెళితే స్టేనరీ లేదని డిజిటల్ అసిస్టెంట్ చెబుతున్నారని వాపోయారు. స్టేనరీ అందుబాటులో లేని విష యం ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి, రైతులకు తగిన సేవలు అందుబాటులో ఉంచాలని రైతులు డిజిటల్ అసిస్టెంట్‌కు సూచించారు.

సంప్రదాయ వ్యవసాయంతో పెట్టుబడి తక్కువ

● రైతులకు శాస్త్రవేత్తల సూచన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మాధవి

నంబులపూలకుంట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఆదాయం ఎక్కువగా పొందినప్పుడే రైతులు లాభాలు పొందుతారని శాస్త్రవేత్తలు పేర్కొన్నా రు. మండలంలోని మేకలచెరువు, ఎస్సీకుంట గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. శాస్త్రవేత్తలు మంజునాథ్, మాధవి, నజారుద్దీన్, ఏడీఏలు సత్యనారాయణ, సనావుల్లా, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... ఆముదం పంట సాగుచేసుకుంటే తక్కువ పెట్టుబడితో పాటు ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం అనుసరిస్తూ, ఘన జీవామృతం తయారీ గురించి రైతులకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. జీలుగా, పిల్లపెసర ఉపయోగాలను వివరించారు. వీటిని పొలల్లో సాగుచేయాలన్నారు. వరి, కదిరి, వేరుశనగలో అధిక దిగుబడి సాధించడానికి జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం, ఆత్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

9,682 ఖాతాలను పునరుద్ధరిస్తాం

● డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్

పుట్టపర్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): హిందూపురం పోస్టల్ డివిజనల్ పరిధిలో నిరుపయోగంగా ఉన్న 9682 ఖాతాలను పునరుద్ధరిస్తామంటూ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ... కొత్త ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయడంతో పాటు డైరెక్ట్ బెనిఫిట్స్ ట్రాన్స్‌పర్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐపీపీబీ బ్యాంకులో కొత్తఖాతాలను తెరవడంతో పాటు ఇప్పటికే ఉన్న ఖాతాలకు ఆధార్‌లింక్ చేస్తున్నామన్నారు. పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఎస్‌టీఎం జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు తాగునీరు బంద్

కదిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చిత్రావతి రిజర్వాయర్ నుంచి నీటిసరఫరాలో అంతరాయం ఏర్పడిందని కమిషనర్ కిరణ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మలకవేమల క్రాస్ పంప్ హౌస్‌లో బ్రేకర్ కాలిపోవడంతో నూతనంగా కొనుగోలు చేసి అమర్చాలన్నారు. దీంతో మంగళవారం నుంచి ఈ నెల ఐదో తేదీ వరకు పట్టణంలో తాగునీటి సరఫరా ఉండదన్నారు. ఈవిషయాన్ని ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

● ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్

కదిరిఅర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక డివిజన్‌లోని ప్రభుత్వ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐ ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ నాయకుల సోమవారం ఆర్డీవో వీవీఎస్ శర్మకు వినతిపత్రం అందిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు లేకపో వడంతో విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశముందన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం అవుతుండ డం తో వసతి గృహ సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న వార్డెన్, అటెండర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, గణేష్, కిరణ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపును పరిశీలించిన జేసీ

నల్లమాడ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఒకటో రేషన్ దుకాణాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. రేషన్ బియ్యాన్ని పాతపద్ధతిలో కాకుండా ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలన్నారు. ఈనెల 15వ తేదీ వరకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగ నాయకులు, డీలర్లు ఉన్నారు.

ఇంటివద్దే రేషన్ పంపిణీ

నంబులపూలకుంట, జూన్2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ చౌక డిపోల పరిధిలో సోమవారం టీడీపీ నాయకుల సమక్షంలో వికలాంగులు, ఒంటరి వృద్ధులకు డీలర్లు ఇంటి వద్దకే రేషన్ అందించారు. ఇంటివద్దకే రేషన్ కార్యక్రమంలో భాగంగా పి.కొత్తపల్లి, ఎగువతూపల్లి పెడబల్లి, గంగెద్దురవారిపల్లిల్లో ఇంటివద్దకే రేషన్ కార్యక్రమం చేపట్టారు. దీనిపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, మాజీ సర్పంచ్ శ్రీరాములనాయుడు, రమణారెడ్డి, వేణుగోపాల్, నరసింహారెడ్డి, నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

వ్యర్థాలన్నీ రోడ్ల పక్కనే..!

● డంపింగ్ యార్డులను తలపిస్తున్న వైనం
● పట్టించుకోని అధికారులు



ఫోర్‌లేన్ రోడ్డు పక్కన వేసిన భవనాల వ్యర్థాలు

పుట్టపర్తిరూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రధాన రహదారులన్నీ అదికారుల పర్యవేక్షణ లోపంతో డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. మరో ఆరునెలల్లో భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సైతం సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. దీంతో పాటు అనాదికాలంగా రోడ్లను సంస్కృతి, నాగరికతకు చిహ్నాలుగా భావించి ఏ ప్రభుత్వ ఏర్పడినా వాటి నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. వీటితో పాటు పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ పేరిట ప్రభుత్వాలు కోట్లాదిరూపాయలు ఖర్చుచేస్తుంటే వాటిని పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ అధికారులు మాత్రం మొద్దు నిద్రలో మునిగిపోతున్నారు. దీంతో కొందరు స్వార్థపరులు పర్యావరణాన్ని సర్వనాశనం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వాలు మాత్రం ప్రజలు పర్యావరణ పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని వివిధ కార్యక్రమాలను ప్రకటిస్తూ, అందు కు సంబంధించి నిధులను భారీగా కేటాయిస్తున్నాయి. కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నాయి. ఇదంతా ఒకవైపు అయితే మరోవైపు రోడ్లను అందంగా శుభ్రంగా ఉంచాల్సిన అదికారులు బాధ్యతను విస్మరించారు. దీంతో స్వార్థపరులు అందంగా ఉండాల్సిన రోడ్లను డంపింగ్ యార్డులుగా మారుస్తున్నారు. దీంతో అందమైన రోడ్లు వివిధ రకాలైన వ్యర్థాలతో నిండి మురికికూపాలుగా మారిపోతున్నాయి.

భవన వ్యర్థాల అన్‌లోడింగ్...

జిల్లాకేంద్రంలో భవన నిర్మాణాల్లో భాగంగా మిగులు వ్యర్థాలను, కూల్చివేసిన భవనాల వ్యర్థాలను, యథేచ్ఛగా పట్టణంలో ఎక్కడ ప్రభుత్వ ఖాళీ స్థలాలు కనిపిస్తే అక్కడికి ట్రాక్టర్లతో తోలుతున్నారు. పట్టణంలో పరిశుభ్రతను పాడుచేస్తున్నారు. ముఖ్యంగా ఫోర్‌లేన్ రోడ్డులో ఎక్కడపడితే అక్కడ భవన నిర్మాణాల వ్యర్థాలను పడవేస్తున్నారు. దీంతో రోడ్లన్నీ వ్యర్థాలతో నిండి కళావిహీనంగా మారుతున్నాయి.

తగులపెడుతున్న వైనం

ప్రతిరోజు పట్టణంలో వెలువడుతున్న చెత్తాచెదారాన్ని కొంతమంది స్వార్థపరులు రాత్రిపూట రోడ్డు పక్కన పారబోసి తగులబెడుతున్నారు. దీంతో వ్యర్థాల నుంచి వచ్చేపొగతో పర్యావరణం కాలుష్యంగా మారిపోతోంది. ముఖ్యంగా ప్రశాంతినిలయం పడమటి గేట్ నుంచి ఫోర్‌లేన్ వెళ్లే దారిలో నిత్యం వ్యర్థాలను పారబోసి, తగులబెడుతున్నారు.

మెడికల్ వ్యర్థాలూ ఫోర్‌లేన్ పక్కనే...

ఆసుపత్రులలో మిగిలిన పోయిన వ్యర్థాలు అంటే ఎక్స్‌పైరీ మందులు, వాడిన సిరంజీలు, మెడికల్ గార్బేజ్, వంటి వాటిని నాశనం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇందులో తడిచెత్త, పొడిచెత్త, గాజు సీసాలు, డిస్పోజబుల్ సిరంజీలు ఉన్నాయి. వీటిని జాగ్రత్తగా నాశనం చేయాల్సిన వైద్యసిబ్బంది బాధ్యతా రహితంగా ఫోర్‌లేన్ రోడ్డులో పారబోస్తున్నా పట్టించుకునే నాథుడు జల్లా కేంద్రంలో కరవయ్యారు.

రోడ్ల పక్కన వ్యర్థాలేస్తే కఠిన చర్యలు



రోడ్ల పక్కన ఎలాంటి వ్యర్థాలను వేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనాలను సీజ్ చేస్తాం, కూలగొట్టిన భవనాల వ్యర్థాలను, ఇతరత్రా వ్యర్థాలను మునిసిపల్ అధికారుల అనుమతితో నిర్దిష్టమైన ప్రాంతాల్లోనే పడవేయాలి. డంపింగ్‌యార్డులో మాత్రమే అన్‌లోడ్ చేయాలి. ఇందుకు త్వరలోనే పూర్తి కార్యాచరణ ప్రకటిస్తాం.

-క్రాంతికుమార్, మున్సిపల్ కమిషనర్

ముందు గొడ్డలి వేటుకు సమాధానమివ్వండి

● అబద్ధాలు మాట్లాడితే పొలిమేర దాటలేవు
-ఎమ్మెల్యే కందికుంట



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కదిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెన్నుపోటు కార్యక్రమం నిర్వహిస్తామని ఉషా శ్రీచరణ్ చెబుతున్నారని... కదిరిలో కొనుగోలు చేసిన గొడ్డలితోనే సొంత బాబాయిని చంపించాడని కోర్టులు చుట్టూ తిరుగుతున్న తన చెల్లికి, ఆ గొడ్డలి వేటు ఎందుకు వేశారో జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాల్సి ఉందనే విషయం గ్రహించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన సోమవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీకి మహిళలన్నా, ప్రజలన్నా గౌరవం లే దన్నారు. ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేదన్నారు. మహిళలను గౌర వించే పార్టీ అయితే తన తల్లి, చెల్లి న్యాయం కోసం రోడ్లపై తిరుగుతుంటే ఎందుకు న్యాయం చేయలేకపోయారని ప్రశ్నించారు. ఈనెల 4న కదిరిలో వెన్నుపోటు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఉషాశ్రీ చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడి ప్రజాస్వామ్యాన్ని రక్షించిన రోజు జూన్ 4 అన్నారు. రాష్ట్ర చరిత్రలోనే రికార్డు సృష్టించిన టీడీపీ, జనసేన, బీజేపీ విజయానికి కారణమెవరని, జగన్‌రెడ్డి లెవన్ రెడ్డిగా ఎందుకు మారిపోయారని ప్రశ్నించారు. మోసపూరిత వాగ్దానాలతో చేసిన పాలనను ప్రజలు నమ్మలేకే కూటమికి పట్టం కట్టారన్నారు ముందు అది తెలుసుకోవాలని సూచించారు. కదిరి అభివృద్ధికి కేవలం సంవత్సరంలోనే పెద్దపీట వేశామన్నారు. వైసీపీ పాలనలో మూడేళ్లగా చేయలేని కదిరి-ఎస్సీకుంట రహదారి మరమ్మతులు చేశామన్నారు. రూ.22 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు వేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా లైన్లు మార్చామన్నారు. హంద్రీనీవా నీటితో కొండారెడ్డి చెరువును నింపిన ఘనత తమదేనన్నారు. రూ.24 కోట్లతో మురుగునీటి శుభ్రతజీ సూచించిన ప్రాజెక్టుకు వైసీపీ స్థలం ఇవ్వలేకపోయిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే ఆ ప్రాజెక్టును చేపట్టామన్నారు. అభివృద్ధిపై అబద్ధాలు మాట్లాడితే ఉషా శ్రీచరణ్‌ను కదిరి పొలిమేరలు దాటకుండా తెలుగు మహిళలు సమాధానం చెబుతారని హెచ్చరించారు. అసెంబ్లీ స్థానాలకు టూరిస్టులాగా వచ్చే ఆమె కదిరికి కూడా వచ్చి టూరిస్టు రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. త్వరలో గ్రామాల్లో పర్యటిస్తామని, ఆమె కూడా తమతో పాటూ వచ్చి అభివృద్ధిని చూడవచ్చన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్షాన్, నాయకులు మేడా శంకర్, మహమ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

'డ్రైనేజీని మేమే శుభ్రం చేసుకుంటాం'



డ్రైనేజీని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల ఎదుట డ్రైనేజీని తామే శుభ్రం చేసుకుంటామని స్థానిక 25వ వార్డు ప్రజలు అన్నారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఇళ్ల ఎదుట ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేయడానికి మున్సిపల్ కాంట్రాక్టర్ సోమవారం రాగా స్థానికులు అడ్డుకున్నారు. డ్రైనేజీ శుభ్రం చేసేందుకు తమ ఇళ్ల ఎదుట ఉన్న అరుగులు, మెట్లను ఎక్స్‌కవేటర్‌తో ఇష్టానుసారం తొలగిస్తే తాము ఇబ్బందులు పడుతామన్నారు. తమ ఇళ్ల ఎదుట ఉన్న డ్రైనేజీని సొంత ఖర్చులతో శుభ్రం చేసుకుంటామన్నారు. అనంతరం టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, నాయకులు వచ్చి పూడిపోయిన డ్రైనేజీలను పరిశీలించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లగా, స్థానికులకు నష్టం జరగకుండా సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో కమిషనర్‌తో వార్డు ఇన్‌చార్జ్ మాట్లాడారు. డ్రైనేజీలను శుభ్రం చేసేకునేందుకు స్థానికులకు వారం రోజులు గడువు ఇవ్వాలని కోరగా కమిషనర్ అంగీకరించారు.

'పరిహారం పెంచాకే పనులు చేయండి'

ముదిగుబ్బ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి వరకు జాతీయ రహదారి (342) కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పెంచి న తరువాతే పనులు చేయాలని వారు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నారాయణస్వామికి వినతిపత్రం అందించారు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం న్యాయమైన పరిహారం అందిస్తేనే పనులు చేయిస్తామ న్నారు. గ్రామసభలు నిర్వహించకుండా, రైతులకు పరిహారం ఎంత ఇస్తారో తెలుపకుండా పనులు సాగిస్తున్నారని వాపోయారు.

టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నంది ఉత్తప్ప

ఓబుళదేవరచెరువు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నంపల్లి పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నంది ఉత్తప్పను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు మండల కన్వీనర్ జయచంద్ర సోమవారం తెలిపారు. అలాగే ఉపాధ్యక్షుడిగా చదివే నరసింహారెడ్డి, కార్యదర్శిగా ఉమ్మడి ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా మల్లిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

వినియోగంలోకి తెస్తాం: ఎంపీడీఓ

● చెత్త సేకరణ కేంద్రాల వద్ద శుభ్రం చేయించిన అధికారులు

ధర్మవరం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న చెత్తసేకరణ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తామని ఎంపీడీఓ సాయి మనోహర్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం 'నిరుపయోగంగా చెత్తసేకరణ కేంద్రాలు అనే కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనానికి స్పందించిన ఎంపీడీఓ రేగాటిపల్లిలోని చెత్తసేకరణ కేంద్రం చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించి పరిశుభ్రం చేయించారు. అలాగే పలు గ్రామాల్లో ఉన్న చెత్తసేకరణ కేంద్రాల వద్ద పరిశుభ్రం చేయించి వాడుకులోకి తీసుకురావాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా అన్ని కేంద్రాలను వాడుక లోకి తీసుకువచ్చి స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంతో అన్ని గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆసుపత్రిలో త్వరలో మరమ్మతులు: డీఎంహెచ్ఓ

నల్లచెరువు (కదిరి), జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో మరమ్మతులు చేయిస్తామని ఎంపీడీఓ తెలిపినట్లు డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం తెలిపారు. 'చిన్నపాటి వర్షానికే కారుతున్న ప్రభుత్వాసుపత్రి' అన్న వార్త ఆంధ్రజ్యోతి దినపత్రికలో మే 30 ప్రచురితమైన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన డిఎంహెచ్ఓ ఫైరోజాబేగం సోమవారం మాట్లాడరు. మరమ్మతులు చేయాలని కాంట్రాక్టర్‌కు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని, దీంతో ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన ఆసుపత్రిని సందర్శించి, ఎంపీపీ నిధులతో మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

కాలనీల్లో రోడ్డు పనులను పరిశీలించిన బీజేపీ ఇన్‌చార్జి

ధర్మవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 27, 28 వార్డులలో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు సోమవారం పరిశీలించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్వయంగా రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, పనుల నాణ్యతలో రాజీపడకుండా పనులు చేపట్టాలన్నారు.

6న అక్షరాభ్యాసం

ఓబుళదేవరచెరువు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో ఈనెల ఆరో తేదీన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల అంజనేయులనాయుడు తెలిపారు.

ఇంటి పట్టాలు ఇవ్వాలి: సీపీఐ

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)



తనకల్లులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఇల్లు లేని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి, పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ముదిగుబ్బ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఎన్నికల హామీల్లో భాగంగా పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో వారికి రెండు సెంట్లు ఇంటి పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఇల్లు లేని పేదలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా తలుపుల, గాండ్లపెంట, నల్లమాడ, తనకల్లు మండలాలకు చెందిన సీపీఐ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. తనకల్లు మండలంలో బొంతపల్లి సర్వేనెంబర్ 181ఎలో గుడిసెలు వెసుకున్న అందరికి పట్టాలివ్వాలని సీపీఐ మండల నాయకులు కోరారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

నంబులపూలకుంట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచలమల గ్రామ ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విగ్రహాలను వెలిచలమల, ఎస్సీకాలనీ క్రాస్‌లో ఊరేగించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వెలిచలమల గ్రామానికి చెందిన బోరెడ్డి చిన్నగంగిరెడ్డి, సుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు నాగిరెడ్డి, పార్వతమ్మ విగ్రహాలను అందజేశారు. ప్రతిష్ఠ సందర్భంగా తీర్థప్రసాదా వినియోగం, అన్నదానం చేశారు.

విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన ఎమ్మెల్యే



సీతారాములకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

గాండ్లపెంట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దివారి గొంది గ్రామంలో సోమవారం సీతారాములు, కదిరి నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. ఆయన నరసింహ స్వామిని, సీతారాములను దర్శించుకుని పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. విగ్రహప్రతిష్ఠ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్, ప్రసాద్, నాయకులు అక్రమ్ బాషా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి బోనాలు



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

నంబులపూలకుంట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకమద్ది గ్రామంలో సోమవారం గ్రామస్థులు వీరభద్ర స్వామికి బోనాలు సమర్పించారు. వంకమద్ది పెద్దచెరువు కట్టపైన వెలసిన వీరభద్రస్వామికి గ్రామనుంచి మహిళలు ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భజనలు, కోలాటం నిర్వహించారు. అన్నదానం చేశారు.

వెన్నుపోటు దినం ర్యాలీని విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 4న నిర్వహించే వెన్నుపోటు దినం ర్యాలీని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన సోమవారం పట్టణంలోని స్వగృహంలో వైసీపీ నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు తమ నిరంకుశ, అరాచక విధానాలను పరిచయం చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ను అమలు చేయడం చాలా కష్టమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుర్రం శీన, చందమూరు నారాయణ రెడ్డి, బాలిరెడ్డి, మాసపల్లి సాయి, జిలాన్ ,గడ్డం కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ధర్నా



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న కల్లుబాయి తండా వాసులు

గాండ్లపెంట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మండలపరిధిలోని కల్లుబాయి తండా వాసులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో గాజుల వారిపల్లి పెద్దతండా పంచాయతీలోని కల్లుబాయి తండా వాసులకు రెండునెలలుగా తాగునీటి సమస్య ఎదురైందని వారు తెలి పారు. గతంలో ఓ రైతు తన వ్యవసాయి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తాగునీటి బోరుకు విద్యుత్ సరఫరా అందించేవారని, విద్యుత్ లోవోల్టేజీ కారణంగా రైతులు కన్షన్ తొలగించారన్నారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తిందని, పలుమార్లు అధికారులకు తెలిపినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి గ్రామానికి ట్యాంకర్ల ద్వారా నీరందిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

క్రికెట్ జిల్లా జట్టుకు కదిరి వాసుల ఎంపిక



నిశ్చయ్, భానుప్రకాష్

కదిరి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అండర్-23 జిల్లా జట్టుకు కదిరి క్రికెటర్లు ఎంపికైనట్లు కోచ్ నజీర్ తెలిపారు. ఇటీవల దక్షిణ మండల అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరచిన కదిరి వాసులు నిశ్చయ్, భానుప్రకాష్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ఆయన సోమవారం తెలిపారు. త్వరలో కడపలో జరిగే దక్షిణ మండల అంతర్ జిల్లాల పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. క్రీడాకారుల ఎంపిక పట్ల క్రికెట్ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కందికుంట వెంకటప్రసాద్, పవన్‌కుమార్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలిపారు.

న్యూస్ బాక్స్

వైభవంగా సప్తమాతృక అమ్మవారి ఉత్సవాలు



ఎలువగంపను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

చిలమత్తూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన సప్తమాతృక అమ్మవారి ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రానికి సమీపంలో పెక్కాల చెరువు గట్టున వెలసిన అమ్మవారికి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, అమ్మవారి నామస్తోత్రాల పఠనం జరిగింది. అనంతరం వెలువగంప ఊరేగింపును మంగళవాయిద్యాలు, డప్పుల మధ్య సాగింది. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి స్థానంలో ఏడుగురు చిన్నారులను ఆశీనులను చేశారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా ఎంతో కాలంగా విరాజిల్లుతోంది. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి

పెనుకొండ టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కొన్నాళ్ల నుంచి నిలిచిపోయిన ఆర్డీటీ సేవలను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకుని ఎఫ్‌సీఆర్‌ఏని పునరుద్ధరించాలని న్యాయవాది ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ గత కొన్నేళ్లుగా ఎన్నో సేవాకార్యక్రమాలు చేపడుతోందని, ప్రస్తుతం నిధులు రాక ఆగిపోయాయన్నారు. పేద ప్రజలకు విద్యా, వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

నేడు కబడ్డీ పోటీలు

పావగడ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తుమకూరు యూనివర్సిటీ జిల్లాస్థాయి మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఒక్కరోజు కబడ్డీ పోటీలు పావగడ పట్టణంలోని కురుబరహళ్లి గేట్ వద్దనున్న డిగ్రీ మహిళా కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శివానందయ్య తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటలకు పోటీలు ఉంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా పది నుంచి 14 కళాశాలల విద్యార్థినులు పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉత్తమ క్యాచర్, ఉత్తమ రైడర్‌కు తగిన బహుమతులు అందజేస్తామన్నారు. యూనివర్సిటీ దైహిక శిక్షణ డైరెక్టర్ డాక్టర్ సుదీప్ కుమార్, పావగడ కళాశాల సంఘటన కార్యదర్శి మధుకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా పోటీలు

పెనుకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి పెనుకొండలో యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినికేతన్ పాఠశాలలో మంగళవారం ఉదయం 10-18 సంవత్సరాల వారికి సోలో యోగా, ఆసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, మెడిటేషన్, 19నుంచి 37సంవత్సరాలలోపువారికి 4వ తేదీన యోగా, పాటలు, పెయింటింగ్‌లను, 6న జూనియర్, సీనియర్లకు యోగాలో వ్యాసరచన, క్విజ్, యోగా స్లోగన్స్ పోటీలను నిర్వహిస్తామన్నారు. బాల బాలికలు, పురుషులు, స్త్రీలకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగలవారు 08555 221116 నంబరును సంప్రదించాలన్నారు.

రేషన్ షాపుల తనిఖీ



చౌక ధరల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో సువర్ణ

గోరంట్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి, మల్లాపల్లిలోని రేషన్ షాపులను సోమవారం పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ తనిఖీ చేశారు. చౌక డిపోల వద్దకు వెళ్లి నిత్యావసర వస్తువుల పంపిణీని పరిశీలించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. సర్వర్ సమస్యల వల్ల పంపిణీకి ఇబ్బందిగా ఉందని లబ్ధిదారులు తెలిపారు. గోరంట్ల పంచాయతీలో నెట్‌వర్క్ సమస్య తీవ్రంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. డీలర్లు సురేంద్ర, మల్లాపల్లి గోపమ్మలతో సమస్యలు అడిగి తెలుసుకుని పంపిణీ సజావుగా జరిగేలా చూడాలన్నారు. తహసీల్దార్ మారుతి, సీఎస్‌డీటీ శ్రీధర్, వీఆర్ఓ అశోక్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లి గ్రామంలో అనారోగ్యంతో ఆదివారం మృతిచెందిన టీడీపీ నాయకుడు, స్టోర్ డీలర్ గోపాల్ కుటుంబ సభ్యులను సోమవారం మంత్రి సవిత పరామర్శించారు. ఆయన భౌతికకాయం వద్ద పూలమాలలువేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు నీరుగంటి చంద్ర, డీవీ ఆంజనేయులు, చల్లాపల్లి రామక్రిష్ణ, టీసీ హరిదాస్, శివశంకర్‌యాదవ్, సంజీవరెడ్డి, ఆకుల రమణ, కిష్టప్ప, అన్సార్‌బాషా, అనసూయమ్మ, జనసైనికుడు నాగరాజు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: రాళ్లదాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త ఆంజనేయులును మంత్రి సవిత పరామర్శించారు. మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన ఆంజనేయులుపై 15రోజుల క్రితం గుర్తుతెలియని దుండగులు రాళ్లతో దాడిచేశారు. విషయం తెలుసుకున్న మంత్రి అనంతపురంలో చికిత్స పొందుతున్న ఆయనను కలిసి పరామర్శించి రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు.

చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హిందూపురం(రొద్దం), జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆర్.మరువపల్లి ప్రాథమిక పాఠశాల ఎదురుగా చెత్తదిబ్బ పేరుకుపోగా పంచాయతీ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. సోమవారం స్వచ్ఛాంధ్రకు తూట్లు అన్న కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు చెత్తను తొలగించి శుభ్రం చేశారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. చెత్తను గ్రామస్థులు చెత్తకుండీల్లోనే వే సేలా చర్యలు తీసుకుంటామని ఈఓఆర్డీ గోవిందప్ప కోరారు.



చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

అందుబాటులో లేని అధికారులు..!

- తహసీల్దార్ కార్యాలయానికి ఇన్‌చార్జిలే దిక్కు
- సమస్యలు పరిష్కారంకాక ప్రజల ఆందోళన
- రెవెన్యూ పాలన అస్తవ్యస్తం



తహసీల్దార్ చాంబర్‌లో కనిపించని ఇన్‌చార్జి అధికారి

సోమందేపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు హాజరై తమ శాఖలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి పరిష్కరించేందుకు కృషిచేస్తారు. రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో గోరంట్ల తహసీల్దార్ మారుతిని ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన రెండుచోట్ల ఉద్యోగం నిర్వహిస్తూ పనిభారంతో అక్కడ కాసేపు ఇక్కడ కొంతసేపు వస్తూ పోతూ ఇబ్బంది పడుతున్నారు. ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆయన రాని సందర్భంలో డీటీ రెడ్డిశేఖర్ అర్జీలను స్వీకరించేవారు. అయితే ఆయన సెలవుపై వెళ్లడంతో ఇటు ఇన్‌చార్జి తహసీల్దార్ లేక అటు డీటీ లేక అర్జీలు ఎవరికి ఇవ్వాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సీఎస్‌డీటీ మోహన్‌నాయక్‌ను ఇన్‌చార్జిగా పెట్టినా ఆయన డీటీ చాంబర్‌లో కంప్యూటర్‌లో కొత్త పనిలో నిమగ్నమవడంతో ప్రజలకు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి. అధికారులు కార్యాలయంలో లేకపోవడంతో వీఆర్‌ఓలు సైతం వివిధ పనుల పేర్లు చెప్పి విధులకు డుమ్మాకొట్టారు. దీంతో రెవెన్యూ సమస్యలకు సంబంధించి చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యయప్రయాసాలకు ఓర్చి కార్యాలయానికి వచ్చిన రైతులు, విద్యార్థులు, ప్రజలు సమస్యలు ఎవరికి విన్నవించాలో తెలియక పడిగాపులు కాశారు. మండలంలోని చాలకూరు, మరువ కుంటపల్లి, మాగేచెరువు, చాకర్లపల్లి, తుంగోడు, తదితర గ్రామాల నుంచి వచ్చినవారు అధికారులు లేరా అంటూ వాకబు చేయడం కనిపించింది. ఖరీఫ్ ముంచుకొస్తుండటంతో పంట రుణాలను రెన్యువల్ చేసుకునే క్రమంలో 1బిలో లోపాలు సరిదిద్దుకోవడానికి, సంతకాల కోసం వివిధ అవసరాలతో కొందరు ఆధార్ దరఖాస్తుల సంతకాల కోసం కొందరు, అటెస్టేషన్, ఇన్‌కం, క్యాస్ట్ తదితర సమస్యలతో కార్యాలయానికి వచ్చిన వారు ఆపసోపాలు పడ్డారు. అటు సచివాలయాల్లో ఇటు రెవెన్యూ కార్యాలయాల్లో వీర్‌ఓలు కనబడకపోవడంతో ఆయా ప్రాంత రైతులు అసహనానికి గురయ్యారు. ఈసీలో ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఈఓఆర్డీ లక్ష్మీనరసప్ప, సెరికల్చర్, హౌసింగ్ ఏఈ రామాంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సిబ్బంది హాజరయ్యారు. ముఖ్యమైన విభాగం అయిన రెవెన్యూ అధికారులు చాంబర్‌లో లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, రైతులు వెనుతిరిగారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిని వివరణ కోరగా సీఎస్‌డీటీ మోహన్‌నాయక్‌ను ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి తాను గోరంట్లకు వచ్చినట్లు తెలిపారు. అయితే అక్కడ సమస్య ఏం జరిగిందో తన దృష్టికి రాలేదన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.



తహసీల్దార్ గది వద్ద అటూ ఇటూ తిరుగుతున్న ప్రజలు

ఇంటి స్థలాల కోసం ధర్నా



సోమందేపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

సోమందేపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనుబంధ సంఘాల నాయకులతో కలిసి కార్యాలయం ఎదుట బైఠాయించారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండుసెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున నివేశ స్థలాలు ఇచ్చి రూ.5లక్షలు రుణమిచ్చి గృహనిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా అమలుకు నోచుకోలేదన్నారు. బాలస్వామి, రమేష్, రాజగోపాల్, నారాయణస్వామి, చాంద్‌బాషా, రంగరాజు, బాబయ్య, ఆంజనేయులు, నూర్‌జహాన్, అంజినమ్మ, మల్లేష్, బేబి, ఆదిలక్ష్మి, శ్వేత పాల్గొన్నారు.

హిందూపురం: ప్రభుత్వం మంజూరుచేసే పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్‌కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశులుకు వినతిపత్రం అందించారు. వినోద్, మారుతిరెడ్డి, బాబు, చలపతి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

గోరంట్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తహసీల్దార్ మారుతికి సోమవారం వినతిపత్రం అందించారు. వారు మట్లాడుతూ మండలంలో ఉపాధి కూలీలకు 8 వారాలుగా బిల్లులు అందలేదని, పేస్లిప్పులు ఇవ్వలేదని, పనిముట్లు చాలకాలంగా పంపిణీ చేయలేదన్నారు. పాలసముద్రం జాతీయ రహదారి కూడలి వద్ద ప్రభుత్వ స్థలంలో నివాసాలున్నవారికి తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, కొండా వెంకటేష్, ముత్యాలప్ప, నాగభూషణ, ఆంజలి, అంజనేయులు, నంజుండప్ప, ప్రదీప్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా బద్రీనాయక్

రొళ్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్‌స్వామి, ప్రధాన కార్యదర్శి బడబాగ్ని అమర్ ప్రోత్సాహంతో సోమవారం స్థానిక రామాలయంలో జరిగిన మండల సమావేశంలో బూత్ సభ్యులు, క్రియాశీలక సభ్యులు కలిసి రెండోసారి బద్రీనాయక్‌ను మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని తెలిపారు. నాయకులు ముద్దరాజు, పట్టాభిరాం, నాగేంద్రబాబు, పరమేశ్, శ్రీనాథ్, రఘు, చంద్రశేఖర్, అశ్వత్థనారాయణ, గోవిందరాజు, పద్మావతి, రామాంజినమ్మ పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ల ఆవిష్కరణ

గుడిబండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ ఇన్‌చార్జి ఈరలక్కప్ప, కార్యదర్శి శివకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం గుడిబండలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెన్నుపోటు దినోత్సవం దినం పోస్టర్లను ఆవిష్కరించారు. మండల కన్వీనర్ ఎంజాయ్‌గౌడ్, సర్పంచ్ అశ్వత్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఉత్తీర్ణత శాతం పెంచాలి

గుడిబండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గురుకుల కళాశాలలో చదివే విద్యార్థునులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని ఎంజేపీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఎంజేపీ కళాశాలను ప్రారంభించారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. 2024-25విద్యా సంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించిందని మంత్రి సవిత చేతులమీదుగా అవార్డు అందుకున్నామని అదే స్ఫూర్తితో 2025-26లోనూ ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకుడు శివలింగప్ప పాల్గొన్నారు.

బెంగళూరులో తెలుగు మహోత్సవం

హిందూపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఆర్ట్‌ఆఫ్ లివింగ్ ఆశ్రమంలో తెలుగు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శిక్షకులు వెంకటస్వామి, సత్యనారాయణ తెలిపారు. ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీ పర్యవేక్షణలో 4 నుంచి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎనిమిదేళ్ల చిన్నారులకు ప్రజ్ఞాయోగ, ఉత్కర్షయోగ, 13ఏళ్ల పైబడినవారికి మేధాయోగ లెవెల్1, 2 ఉంటాయన్నారు. 18ఏళ్ల పైబడిన వారికి హ్యాపీనెస్ ప్రోగ్రాం ఆనందమయ శిక్షణ ఉంటాయని తెలిపారు. వీటితోపాటు వేర్వేరు కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది పాల్గొంటారని, హిందూపురం ప్రాంతంలోని వారు కూడా పాల్గొనవచ్చన్నారు.

కొత్త హాస్టల్ వద్దు.. పాతదే ముద్దు..!

- మూడు కి.మీ. దూరంలో హాస్టల్
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్

పావగడ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కొత్త హాస్టల్ కన్నా పాతదే మేలని విద్యార్థులు అంటున్నారు. కళాశాల, పాఠశాలలకు మూడు కిలోమీటర్ల దూరంలో హాస్టల్ ఉండటంతో సమస్యగా మారింది. పాఠశాలలు ప్రారంభమైనా నేటికీ హాస్టల్ ప్రారంభానికి నోచుకోలేదు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సంక్షేమ వసతి గృహాలకు విముక్తి లభించనుంది. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదు వసతి గృహాలను రూ.33.5కోట్లుతో నిర్మాణం చేపట్టారు. 807మంది ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులకు ఈ గృహాల్లో వసతి లభించనుంది. ఈ వసతి గృహాలు కళాశాలలు, పాఠశాలలకు మూడు కిలోమీటర్ల దూరం ఉండటంతో విద్యార్థులకు సమస్యగా మారింది. పట్టణంలోని తుమకూరు రోడ్డులో కనుమ నరసింహస్వామి ఆలయం ముందు సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయం నుంచి ఐదు హాస్టళ్లు నిర్మించడానికి 2021-22లో క్రైస్ సంస్థకు అప్పగించారు. నిర్మాణ పనులు పూర్తయినా ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించడంతో ఆగిపోయింది. హాస్టల్ పక్కనే వైశ్య కులస్థులకు చెందిన శ్మశానవాటిక ఉండడంతో రాత్రి పూట నిద్రించడానికి విద్యార్థులు భయపడిపోతున్నారు. 2021లోఅప్పటి ముఖ్యమంత్రి గోవింద కారజోళ చేతుల మీదుగా భూమిపూజ చేసినప్పుడే హాస్టల్ నిర్మాణం వద్దని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. కేవలం కాంట్రాక్టర్లతో కమీషన్ల కోసమే కక్కుర్తిపడి వందలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న పాలకుల నిర్లక్ష్యం, స్వార్థానికి ఎవరు సమాధానం చెప్పాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విత్తన వేరుశనగ పంపిణీకి సర్వం సిద్ధం



చిలమత్తూరులో రైతు సేవా కేంద్రానికి వచ్చిన కాయలు

చిలమత్తూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు రాయితీ ధరతో విత్తన కాయలను అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం మండలంలోని పలు రైతు సేవా కేంద్రాలకు విత్తన వేరుశనగ కాయలు చేరుకున్నాయి. చిలమత్తూరు 1, 2, 3తోపాటు కోడూరు-2, చాగలేరు, మొరసలపల్లి కేంద్రాలకు విత్తనకాయలు చేరాయి. ఒక్కో రైతు సేవాకేంద్రానికి వంద క్వింటాళ్ల కాయలు మొదటి విడతగా వచ్చినట్లు మండల వ్యసాయాధికారి వంశీకృష్ణ తెలిపారు. 30 కిలోల విత్తనకాయల బస్తా రాయితీపోను రూ.1,674 చెల్లించాలన్నారు.

అగళి: విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు పేర్లను రైతు సేవా కేంద్రాల్లో సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఏఓ శేఖర్‌నాయక్ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సత్యసాయిజిల్లాకు 63,918 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు ప్రభుత్వం కేటాయించిందన్నారు. కె-6, సిజిఎస్-1694 రకం విత్తన వేరుశనగ 30కేజీల బస్తా పూర్తి ధర రూ.2790కాగా.. 40శాతం సబ్సిడీపోను రైతువాటాగా రూ.1674 చెల్లించాలన్నారు. కదిరి, లేపాక్షి రకం 30కేజీల బస్తా పూర్తి ధర రూ.2460కాగా రూ.1476చెల్లించాల్సి ఉంటుందన్నారు.

లేపాక్షి: ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసే రైతులు సబ్సిడీ విత్తనకాయల కోసం తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండలవ్యవసాయాధికారి శ్రీలత సూచించారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రాయితీ వేరుశనగ సిద్ధంగా ఉందన్నారు.

రొళ్ల: ప్రభుత్వం సబ్సిడీతో పంపిణీ చేసే విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు తమ పేర్లు నమోదుచేసుకోవాలని ఏఓ రాజ్యలక్ష్మీ తెలిపారు. మీ సమీపంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదుచేసుకుని సబ్సిడీ వేరుశనగను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే వైసీపీ డ్రామా

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల



మడకశిర టౌన్, జూన్2(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటి వెలుగులో వస్తుండడంతో వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ధర్నాల డ్రామాను జగన్, ఆ పార్టీ నాయకులు ఆడుతున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి అన్నారు. సోమవారం బాలాజీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెన్నుపోటు, గొడ్డలివేటు అంతా అప్పట్లో జగన్ డ్రామా కాదా అని ప్రశ్నించారు. ఇలాంటి డ్రామాలు ఆడడం జగన్ అండ్ కోకు కొత్త కాదన్నారు. ఆస్తికోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి, కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడించింది ఎవరని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో 85శాతం హామీలు ఎగనామం పెట్టి ప్రజలకు వెన్ను పోటుపొడించింది ఎవరన్నారు. కూటమి ప్రభుత్వంలో తొలి ఏడాదిలోనే 70శాతం హామీలు అమలు చేసిన ఘనత చంద్రబాబుది అన్నారు. కాంగ్రెస్‌ను అడ్డంపెట్టుకొని రూ.లక్షలు కోట్లు దోచుకొని అదే పార్టీకి వెన్నుపోటు పొడిచింది ఎవరు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు నిరుద్యోగ యువత కోసం 16,347 డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. రూ.12వేల కోట్లతో 20వేల కిలో మీటర్లు రోడ్డు వేయడం ఈ ప్రభుత్వం చేసిన గొప్ప పనికాదా అని అన్నారు. వెన్నుపోటు దారుడు జగన్‌రెడ్డి వెన్నుపోటు అంటూ ధర్నాలు చేయడం దొంగే దొంగ అన్న చెందంగా ఉందన్నారు.

పట్టణాభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ: చైర్మన్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే పీఏ

హిందూపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పట్టణాభివృద్ధి గాలికి వదిలారంటూ మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పట్టణంలోని హస్నాబాద్‌లో పర్యటించారు. ఆయా ప్రాంతంలో రోడ్లు, కాలువలు, పారిశుధ్యం, వీధిలైట్లు, నీటి సమస్య, పింఛన్ ఇతర సదుపాయాలపై ఆరాతీశారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలువలపై అక్రమ కట్టడాలు నిర్మించడంవల్ల ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి రోడ్లపై మురుగునీరుతో ప్రజలు ఇబ్బందులు ప్రజలు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే పీఏ వీరయ్య, నాయకులు జహరార్, రహమత్, వలీ, ముబారక్, మునిసిపల్ అధికారులు శోభన్‌రెడ్డి, చంద్రమ్మ, జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న శివకుమార్ తదితరులు

పెనుకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు రొద్దం శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బాలుర వసతిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. నియమ నిబంధనలను తుంగలోతొక్కి విద్యను వ్యాపారం చేస్తున్నా ఆ పాఠశాలలకు అధికారులు వత్తాసు పలుకుతుండటం దారుణమన్నారు. మండల అధ్యక్షుడు అనిల్, నాయకులు మనోజ్, అజయ్, నరసింహ, సందీప్ పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి అర్చకులు రాఘవేంద్ర శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధరకాల పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రంగా ఉంచాలి

అగళి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీడీపీఓ నాగమల్లీశ్వరి కార్యకర్తలకు సూచించారు. అగళిలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉదయం 9 నుంచి 4గంటల వరకు సెంటర్లో ఉండాలన్నారు. గ్రేట్ ఆధార్ బాల సంజీవని యాప్‌లో అన్ని వందశాతం నమోదు చేయాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో ఆశా కార్యకర్తలు సక్రమంగా పనిచేసుకోవాలని, పిల్లల్ని సెంటర్‌కు పిలిపించుకుని మళ్లీ పంపాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు తదితర విషయాలపై చర్చించారు. సూపర్‌వైజర్ లీలావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

హిందూపురం(రొద్దం), జూన్ 2(ఆంధ్రజ్యోతి): రొద్దం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, మంత్రి సవిత ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సోమవారం ఆసుపత్రిలో టీడీపీ నాయకులు, ట్రస్ట్ నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. ప్రతి నెలా మూడో సోమవారం ఆసుపత్రికి పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులు, సిబ్బందికి అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు లింగప్ప పాల్గొన్నారు.

హెచ్‌ఎంల నియామకం

అగళి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను నియమించినట్లు ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. అగళికి మస్తాన్, ఆర్‌జిపల్లికి గోపి, ఇరిగేపల్లికి రాఘవేంద్ర, ఇనగలూరుకు పవన్‌కుమార్‌రెడ్డిలను ప్రధానోపాధ్యాయులుగా నియమించారన్నారు. వారు ఆయా పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టారన్నారు.

రేషన్ సరుకుల పంపిణీ

హిందూపురం(రొద్దం), జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం రేషన్ షాపులోనే 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకులు పంపిణీ కూటమి ప్రభుత్వం చేపట్టింది. సోమవారం రొద్దంలోని రేషన్ షాపుల్లో టీడీపీ నాయకులు సరుకులు పంపిణీ చేశారు. నాయకులు చంద్రమౌళి, నరసింహులు, చిన్నప్పయ్య, అశ్వర్థనారాయణ, సిద్దన్న, శంకర్, ఉగ్గీరప్ప, తిరుపాల్‌నాయుడు, కిష్టప్ప, చంద్రశేఖర్, బేల్దార్ కిష్ట పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెనుకొండ టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పెనుకొండలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు మహ్మద్‌రఫీక్(40) అనే వ్యక్తి బట్టల వ్యాపారం చేసుకుని స్థానిక దర్గాపేటలో నివాసముంటున్నాడు. వ్యాపారంలో వచ్చే డబ్బులతో మద్యం సేవించి భార్య జుగ్నూతో తరచూ గొడవపడేవాడన్నారు. ఇది భరించలేని భార్య పుట్టినిల్లయిన గౌరీబిదునూరుకు వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రఫీక్ ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడు. రఫీక్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.